పెద్ద కథ ప్రారంభం

# ఇది సంధ్యా సమయం

నందం రామారావు



సాయంత్రం సుజాత ఇంటికొచ్చేసరికి, ఇంటి ముందు కామేశ్వరరావుగారి కారు ఆగివుంది

ఆ కారుని చూసి సుజాత సంతోషంగా - 'డాక్టర్‌గారు వచ్చినట్టున్నారు వారిని చూసి చాలా రోజులయింది ' అని అనుకుంటూ గబగబా మెట్లెక్కి లోపలకొచ్చింది

హాల్లో కామేశ్వరరావుగారూ, మరో యువకుడూ కన్పించారు డాక్టర్‌గారిని పలుకరించబోయేదల్లా క్రొత్త వ్యక్తిని చూసి ఆగిపోయింది సుజాత తలొంచుకుని మెల్లగా లోపల కెళ్ళబోయింది

ఇంతలో కామేశ్వరరావుగారు – ''సుజాతా !'' అని పిలవడంతో ఆగి వెనక్కితిరిగి చూసింది

''సుజాతా! ఏవిటమ్మా అలా మాట్లాడకుండా వెళ్ళిపోతున్నావ్ నన్ను మర్చిపోయావా ?'' అని అడిగారాయన నవ్వుతూ.

ఆ మాటకి ఏం సమాధానం చెప్పాలో తోచక– ''అబ్బే ! లేదండి '' అంటూ ఆ యువకుడివేపు చూసింది

సుజాత భావాన్ని గ్రహించిన ఆయన – ''ఓ ! అదా విషయం'' అంటూ నవ్వి –

''ఇతడేం పరాయివాడు కాడమ్మా మా అబ్బాయి శ్రీనివాస్ క్రిందటి నెలలోనే హౌస్ సర్జన్సీ పూర్తయింది ప్రస్తుతం నా దగ్గర అసిస్టెంట్‌గా వుంటున్నాడు '' అని శ్రీనివాస్‌వేపు తిరిగి –

''ఈ అమ్మాయి సుజాత శేషగిరి రెండో కూతురు. బ్యాంక్‌లో పనిచేస్తోంది'' అంటూ పరస్పరం పరిచయం చేశారు.

సుజాత నమస్కారం చేసింది.

శ్రీనివాస్‌కూడా నవ్వుతూ – ''నమస్కారం'' అన్నాడు

''ఇప్పుడే వస్తానండీ !'' అంటూ సుజాత సరాసరి వంటింట్లో కెళ్ళింది.

వంటింట్లో జయ కిరసనాయిలు స్టౌ ముందు కూర్చుని 'టిఫిన్' చేసే ప్రయత్నంలో వుంది

అది చూసి సుజాత – ''ఏమిటక్కా ! వాళ్ళని అక్కడ కూర్చోబెట్టి ఇప్పుడు మొదలెట్టావా ?'' అంది

''ఇదిగో అయిపోవచ్చిందే'' అంటూ కొద్దిగా వుప్మా పళ్ళెంలో వేసి –

''రుచి చూడు'' అని సుజాత కందించింది

''నువ్వు చెయ్యడం బావుండకపోవడమా ?'' అంటూ వుప్మా నోట్లో వేసుకుని –

''బాగానేవుంది ప్లేటులోపెట్టి త్వరగా ఇవ్వు'' అంటూ తొందర చేసింది సుజాత.

''ఒక్క నిముషం'' అంటూ జయ గిన్నెలో నెయ్యివేసి కలపసాగింది.

''అమ్మేది ?'' అనడిగింది సుజాత

''పంచదార తేవడానికి పక్కింటికెళ్ళింది. అదిగో వచ్చేస్తోంది'' అన్నది జయ.

సుజాత తల తిప్పిచూసింది.

పంచదార గిన్నెతో లోపలికి అడుగుపెట్టింది కమలమ్మ.

కమ్మలమ్మ సుజాతని చూసి – ''వచ్చావా సుజాతా ! త్వరగా కప్పులు కడిగి, కాఫీ

తీసుకురా వాళ్లతో మాట్లాడుతూ వుంటాను'' అంటూ తన చేతిలోని పంచదార గిన్నెను క్రింద పెట్టి హాల్లోకి వెళ్ళింది కమలమ్మ

జయ వుప్మా ప్లేట్లలో సర్దసాగింది

''రవీ, గీతా ఇంకా స్కూలు నుంచి రాలేదా అక్కా ?'' అనడిగింది సుజాత.

'వచ్చారే ఆడుకోవడానికి వెళ్ళేరేమో''

''సుజా! ఇవి తీసుకెళ్ళి వాళ్ళకిచ్చిరా.''

సుజాత ప్లేట్లని ట్రేలో పెట్టుకుని హాల్లో కొచ్చి కామేశ్వరరావుగారికి, శ్రీనివాస్‌కి చెరో ప్లేటు యిచ్చింది

''ఎందుకమ్మా ఇది. నేనేమన్నా కొత్త చుట్టాన్నా ?'' అన్నారాయన.

''కొత్త చుట్టాలు కాదు గనుకనే వుప్మాతో సరిపెట్టాం'' అంటూ నవ్వింది సుజాత.

''అలాగా !'' అంటూ కామేశ్వరరావుగారు కూడా నవ్వారు

సుజాత తల్లి ప్రక్కగా వచ్చి నిలబడింది

కామేశ్వరరావుగారు వుప్మా తింటూ—

''సుజాతా! ఈ వుప్మాని చూస్తుంటే మీ నాన్న జ్ఞాపకం వస్తున్నాడు తల్లీ! మీ నాన్నా, నేను చిన్నప్పుడు హోటల్‌కెడితే ఒకే ప్లేటు వుప్మా తెప్పించుకునేవాళ్ళం 'రోజూ ఇదే టిఫినా ?' అంటే, నాకిదే ఇష్టంరా! అనేవాడు హోటల్‌కే కాదు, ఎక్కడికెళ్ళినా ఇద్దరం కలిసే వెళ్ళేవాళ్ళం క్లాసులో ఫస్ట్ మార్కులు వాడివి సెకండ్ మార్కులు నావి మమ్మల్ని చూసి అందరూ రామ లక్ష్మణులనేవారు. కానీ, హైస్కూలు చదువయ్యాక ఇద్దరం విడిపోవాల్సి వచ్చింది. నేను కాలేజీలో చేరాను వాడు టైపు నేర్చుకుని గుమాస్తాగా స్థిర పడ్డాడు మనుషుల మధ్య దూరం ఏర్పడినా మా మనసులు మాత్రం ఎన్నడూ దూరం కాలేదు నాకీ వూరు ట్రాన్సఫరయిందని తెలిసిన రోజున వాడికి దగ్గరగా వుండొచ్చని ఎంతో సంతోషించాను కాని, మేము కలిసి వుండడం ఆ దేవుడికే ఇష్టంలేదేమో. శేషగిరిని నా నుంచి శాశ్వితంగా దూరం చేశాడు''

ఆయన కంఠం దుఃఖంతో బొంగురుపోయింది మలమ్మ కళ్ళు వొత్తుకోసాగింది తండ్రి జ్ఞాపకా తో సుజాత మనస్సు బరువెక్కింది

కామేశ్వరరావుగారు టిఫిన్ పూర్తిచెయ్యకుండానే వుప్మా ప్లేటుని క్రింద పెట్టేశారు

''అయ్యో! వదిలేశారే!'' అంది కమలమ్మ నొచ్చుకుంటూ

''వద్దమ్మా శేషగిరి జ్ఞాపకం వస్తున్నాడు. నాలనిపించడంలేదు''

సుజాత మంచినీళ్ళ గ్లాసు అందించింది.

''శేషగిరి నిజంగా చాలా గొప్పవాడమ్మా — నేనేకసార్లు నా కుటుంబ సమస్యల్ని గూర్చి వ్రాసి వాడి సలహా తీసుకుంటూ వుండేవాడిని కానీ, వాడు ఎంత ఆర్థికంగా బాధపడుతున్నా ఒక్కసారికూడా దానిగూర్చి వ్రాయలేదు ఓసారి నేనీ వూరు వచ్చి, క్కడి పరిస్థితులు చూసి — ''ఒక్కసారి కూడా టిగూర్చి వ్రాయలేదేం ?'' అని అడిగితే, దానికి శేషగిరి నవ్వి — 'ఒరే! సుఖాలు పదిమందితో పంచు కోవాలి. దుఃఖం మనసులోనే దాచుకోవాలి' అని న్నాడు అంత మంచివాడిమీద దేవుడికి దయలేక పోయింది.'' కామేశ్వరరావుగారు కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకున్నారు

ఇంతలో సుజాత కాఫీ తీసుకొచ్చి యిచ్చింది.

కామేశ్వరరావుగారు కాఫీ తాగి — ''నాదొక్కటే బాధమ్మా స్నేహితుడిగా నేనే సహాయం చెయ్యా లనుకున్నా, మీరు అంగీకరించడంలేదు.'' అని అన్నారు.

''అదేమిటి బాబుగారూ! మీరు సుజాతకు వుద్యోగం వేయించారు. అంతకంటే గొప్ప సహాయం ఇంకేం కావాలి మాకు''

''అదికాదమ్మా .. నేనో పదివేల రూపాయ లిస్తాను మంచి సంబంధం చూసి జయకు పెళ్ళి చెయ్యండి''

కమలమ్మ అభ్యంతరం చెబుతూ — ''డాక్టర్ గారూ! ఆయన స్వభావం మీకు తెలుసు. ఇప్పటికే మీరు మాకు చాలా సహాయం చేశారు అమ్మాయికి వుద్యోగం వేయించారు అంతేచాలు.''

''వుద్యోగం నేను వేయించలేదమ్మా. అమ్మాయి పరీక్ష వ్రాసింది. పాసయింది. పైగా ఇంటర్వ్యూ బాగా చేసింది.''

''ఏదైనా కానివ్వండి దయచేసి ఇక ముందెప్పుడూ డబ్బు ప్రస్తావన తీసుకురాకండి'' అంది కమలమ్మ.

ఆయన — ''మీ ఇష్టం'' అని వూరుకుని, క్షణం ఆగి — ''మీరు మాత్రం చాలా 'వీక్'గా కనిపిస్తున్నారు. నేను క్రితంసారి వచ్చి చూసిన దానికన్నా మీరు చాలా చిక్కిపోయారు. మందులు రాసిస్తాను అవైనా వేసుకుంటారా ?'' అన్నారు.

''నాకు మందులెందుకండి?'' అన్నది కమలమ్మ.

''సుజాతా! అమ్మగారిచేత మందులు వేయించే బాధ్యత నీది''

కామేశ్వరరావుగారు చీటీ వ్రాయబోయి ఆగి — ''నా దగ్గర కొన్నిమందులు వూరికే పడివున్నాయి. మీకు పంపుతాను'' అని అనాలనుకున్నారు కానీ, కమలమ్మ ఏమనుకుంటుందోనని గబగబా చీటీ వ్రాసి సుజాత చేతికిచ్చి —

''నేను మళ్ళా రెండు రోజులుపోయాక వచ్చి అమ్మగారిని చూస్తాను వస్తానమ్మా'' అంటూ లేచి బయటకు నడిచారు.

శ్రీనివాస్‌కూడా లేచి కమలమ్మకి నమస్కారం చేసి, సుజాతతో —

''వస్తానండీ'' అని చెప్పి తండ్రిని అనుస రించాడు

సుజాత కారు కదిలేవరకూ గుమ్మంలోనే నిలబడి, ఆ తర్వాత లోపలకొచ్చింది

జయ మిగిలిన వుప్మా అందరికీ ప్లేట్లలో సర్ది సుజాతకొకటీ, తల్లికొకటీ యిచ్చింది

''నాకెందుకే ఇది తింటే ఏదైనా చేస్తుందేమో ?''

''ఏం ఫర్వాలేదమ్మా, తిను, నీకేంజబ్బుచేసినా, మనకిప్పుడు ఒకళ్ళు కాదు, ఇద్దరు డాక్టర్లున్నారు'' అంది సుజాత నవ్వుతూ

కమలమ్మ శ్రీనివాస్‌ను తలుచుకుంటూ—

''కామేశ్వరరావుగారు చాలా అదృష్టవంతుడే జయా! కుర్రాడు రత్నంలా మెరిసిపోతున్నాడు



ఫస్ట్ క్లాసులో ప్యాసయ్యాట్ట ఆ వచ్చే భార్య ఎవరోగానీ పెట్టి పుట్టింది'' అని అన్నది.

''అవునక్కా ! నువ్వు చూడలేదు గానీ, డాక్టరంటే ఇలా వుండాలి అన్నట్టుగా వున్నాడు'' అంది సుజాత నవ్వుతూ

సుజాత టిఫిన్ తిని, కాఫీ తాగింతర్వాత గదిలో కొచ్చి, నిన్న సగం చదివిన నవల పుచ్చుకుని మంచం మీద కూర్చుంది నవల చేతిలో వున్నదన్న మాటే గానీ ఒక అక్షరం కూడా చదవలేక పోయింది !

కళ్ళముందు శ్రీనివాస్ మెదులుతున్నాడు

ఎంత బాగున్నాడు !

పేరుకు తగ్గ రూపం !

అమ్మ అన్నట్టు— ఆ వచ్చే భార్య చాలా అదృష్టవంతురాలు

అందం, చదువు, డబ్బూ వున్న వ్యక్తి భర్తగా లభించడం ఆ పిల్లకు గొప్ప అదృష్టం !

అటువంటి అదృష్టం ఎవరికో !

తనలాంటి వాళ్ళకు మాత్రం కాదు !

అలా అనుకోగానే సుజాత మనస్సంతా శూన్యంగా అయిపోయింది !

ఆఫీసు బ్రేక్‌లో కప్పు కాఫీ తాగితే డబ్బు అయిపోతుందేమోనని బాధపడే తనకు అంతటి అదృష్టం కూడానా ?

ఈ ఇల్లూ, పిల్లలూ, వాళ్ళ చదువులూ, అక్క పెళ్ళి వీటిలో నడిసముద్రంలో నావలా వుంది తన స్థితి !

ఒక్క సరదా లేదు

సంతోషం లేదు !

చిన్న కోరిక కూడా తీర్చుకోలేని పరిస్థితి.

ఏం జీవితాలివి ?

మధ్య తరగతి కుటుంబంలో ఆడపిల్లగా మాత్రం పుట్టకూడదు !

డబ్బు వుండదు

చదువుండదు

## ఇది సంధ్యా సమయం

పెళ్ళిళ్ళు కావు !

అడుగడుగునా సమస్యలు

కష్టాలు కన్నీళ్ళు !

తనకు వుద్యోగమైనా వుంది కానీ, అక్కలాటి వాళ్ళ బ్రతుకు మరీ అధ్వాన్నం క్షణం విశ్రాంతి లేకుండా వుదయం లేచిందగ్గర్నుంచీ రాత్రి వరకూ ఒకటే పని !

కామేశ్వరరావుగారు పదివేలు యిస్తామంటున్నారు ఆ పదివేలూ తీసుకుని హాయిగా అక్క పెళ్ళి జరిపించకూడదూ ? తినడానికి తిండి లేకపోయినా తమలాటివాళ్ళకు అభిమానాలకేం కొదవ లేదు ! ఐనా, అమ్మ పట్టుదల మరీ అర్ధంలేనిది పంతాలకూ, పట్టుదలలకూ పోతే జీవితాలు బాగు పడతాయా ? అక్కకి ఎప్పటికి పెళ్ళవుతుందో ? ఎప్పటికీ జీవితం నుంచి అక్కకు విముక్తి లభిస్తుందో ?

అనేక విధాలుగా ఆలోచిస్తూ ఎప్పుడో నిద్ర పోయింది సుజాత !

* * *

సుజాత తండ్రి శేషగిరి సామాన్య గుమాస్తా ఆయనకు అన్నివిధాలా తగిన అర్ధాంగి కమలమ్మ

ఉన్నంతలోనే పొదుపుగా గడుపుకుంటూ గుట్టు చప్పుడు కాకుండా కాపురం సాగిస్తూ వచ్చారిద్దరూ! ఆయనకి ముగ్గురాడపిల్లలూ, ఒక మగపిల్లవాడు

పెద్దపిల్ల జయ టెన్త్‌క్లాస్ ప్యాసవగానే — ''ఆడపిల్లకు చదువెందుకండీ ఎంత చదివించినా పెళ్ళి చెయ్యవల్సిందేగదా ! పెద్ద చదువులు చదివిస్తే అంతకుమించిన వరుడిని తీసుకురావాలి. మనస్థితికి గొప్ప సంబంధం ఎక్కడ్నుంచి తీసుకురాగలం చదువు మానిపించెయ్యండి ఏదో ఒక సంబంధం చూసి రేపు వైశాఖంలో ముడిపెట్టేద్దాం'' అని కమలమ్మ చెప్పడంతో జయకు చదువు మాన్పించేశాడు శేషగిరి !

ఆ వైశాఖం వెళ్ళింది

మరో వైశాఖం కూడా వచ్చింది

ఎన్ని వైశాఖలు వెళ్ళాయో !

జయకి పెళ్ళి మాత్రం కాలేదు

సంబంధాలు వచ్చి తిరిగిపోతున్నాయి

అందమైన జయలో ప్రతివాళ్ళకీ ఏదో లోపం కనిపిస్తూనేవుంది

ఆ లోపం కట్నం చాలకపోవడమే ! ఈలోపు జయ తర్వాత సుజాత టెన్త్ ప్యాసయింది

''దీని చదువు ఇక ఆపించేస్తారా ?'' అని కమలమ్మ అడిగింది

అప్పటికే జయ పెళ్ళి సంబంధాల కోసం తిరిగి తిరిగి మానసికంగా, శారీరకంగా కృంగిపోయిన శేషగిరి కమలమ్మ మాటకు అభ్యంతరం చెప్పి —

''చూడు కమలా ! జయని చదువు మాన్పించి పెద్ద పొరబాటు చేశాం దానికి చదువు చెప్పించక, పెళ్ళి చెయ్యలేక, దాని భవిష్యత్తును మనం నాశనం చేశాం సుజాతనైనా చదివిద్దాం కనీసం దాని బ్రతుకు అది బ్రతుకుతుంది నే నెలాగూ నా పిల్లలకు ఏవిధమైన ఆస్తి ఇవ్వడంలేదు పిల్లలకు చదువు చెప్పించడమే నేనివ్వగల ఆస్తి'' అన్నాడు

భర్త మాటల్లోని ఆవేదనని గుర్తించిన కమలమ్మ ఇంక మాట్లాడలేక పోయింది !

జయకి పెళ్ళి చెయ్యలేక పోయామే అని ఆవిడ రోజూ బాధపడుతూనే వుంది అందుకే, సుజాత చదువు గురించి భర్తతో వాదించలేదు !

సుజాత ఇంటర్‌లో చేరింది, దాంతోపాటు టైపు కూడా నేర్చుకోసాగింది

రెండేళ్ళు గడిచాయి !

జయకి పెళ్ళి కుదరలేదు

కాని, సుజాత ఇంటర్ ప్యాసయింది !

''నాన్నా ! డిగ్రీలో చేరనా ?'' అనడిగింది సుజాత ఓ రోజు తండ్రిని

ఆ ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో తోచలేదాతండ్రికి !

సుజాత ఇంటర్‌లో చేరేటప్పుడు, ఆ రెండేళ్ళల్లో జయ పెళ్ళి అవుతుందని, సుజాత ఇంటర్ ప్యాసవ్వగానే సుజాతకి కూడా పెళ్ళి చెయ్యొచ్చని శేషగిరి ఆశించాడు కానీ, జయకు పెళ్ళి చెయ్యలేక పోయారు !

ఇప్పుడు సుజాతకూడా పెళ్ళికి ఎదిగికూర్చుంది! సుజాత తర్వాత ఇంకో ఆడపిల్ల ఒక కొడుకూ వున్నారు

తను ఇంకో మూడేళ్ళల్లో రిటైరవుతాడు !

పిల్లలు పెళ్ళిళ్ళు

వాళ్ళ చదువులు !

ఎలా ? ఎలా ?

శేషగిరికి భవిష్యత్తంతా అంధకారంలా, తానొట్టి అసమర్ధుడిలా, చేతకానివాడిలా అనిపించ సాగింది !

ఆయన కళ్ళముందు భార్యా, పిల్లలూ నిలబడి— ''రేపు మా గతి ఏవిటి ? మమ్మల్నేం చెయ్యదలచు

నిజామాబాద్ ఎ.ఎన్ ఆర్ కల్చరల్ అసోసియేషన్‌వారు ఇటీవల హైదరాబాదులో నిర్వహించిన అక్కినేని అభినందన సంచిక 'కళారత్న' ఆవిష్కరణోత్సవ సభలో ప్రసంగిస్తున్న ప్రముఖ దర్శకుడు శ్రీ దాసరి నారాయణరావు, సంస్థ కార్యదర్శి సిహెచ్ శంకర్, సంస్థ గౌరవాధ్యక్షులు శ్రీ ఎ. సూర్యప్రకాశ్, సభకి అధ్యక్షత వహించిన డా. కె వి కృష్ణకుమారిగార్లని చిత్రంలో చూడవచ్చు.



కున్నారు ?'' అని వేయి గొంతులతో ప్రశ్నిస్తున్నట్లనిపించింది

అవును ! తను భార్యా పిల్లలకూ ఏంచేశాడు ? ఏం చెయ్యలేదు ! ఏం చెయ్యకపోగా అందరికీ అశాంతిని కలిగిస్తున్నాడు

ఈ ఆలోచనలతో ఆయన బలహీనమైన గుండె ఆ ప్రశ్నలకు జవాబు చెప్పలేక మౌనం వహించింది !

అంతే !

తెల్లారి లేచేసరికి కట్టెలా బిగుసుకుపోయిన శేషగిరి శరీరాన్ని చూసి అందరూ ఘొల్లుమన్నారు !

జరగవలసిన విధులు జరిగిపోయాయి ! 'తన బ్రతుకు తాను బ్రతుకుతుంది' అని చదివించిన సుజాత చదువు కుటుంబాన్ని బ్రతికించడానికి వుపయోగపడింది !

సుజాత మొదట ఒక ప్రైవేట్ కంపెనీలో చేరి, ఆ తర్వాత కామేశ్వరరావుగారి సహాయంతో పరీక్షలు ప్యాసయి, బ్యాంక్ వుద్యోగంలో చేరింది !

* * *

''హల్లో ! మిస్ సుజాతా !''

లెడ్జర్లో ఎక్కౌంట్లు చూస్తున్న సుజాత తలెత్తి చూసింది

ఎదురుగా కుమార్ నిలబడివున్నాడు

## ఇది సంధ్యా సమయం

అతన్ని చూసి సుజాత ముఖం చిట్లించి ''ఏం కావాలి ?'' అంది

''మీరే !'' అన్నాడు కొంటెగా నవ్వుతూ

''షటప్'' అంది

కుమార్ నవ్వాడు నవ్వి — ''అబ్బా! కోపంలో కూడా ఎంత అందంగా వున్నారండీ అందుకే మీరంటే నా కెంతో ఇష్టం'' అన్నాడు

అతని మాటలు కోపంతోపాటు అసహ్యాన్ని కూడా కలిగించాయి సుజాతకు 'ఇతని మాటలు ఎవరూ వినడంలేదుకదా !' అనుకుని చుట్టూ చూసింది అందరూ ఎవరి పనుల్లో వాళ్ళున్నారు !

''మిస్టర్ కుమార్ ! మర్యాదగా వెడతారా ? ప్యూన్ని పిలవమంటారా ?'' కోపంగా అన్నది సుజాత

''అంత శ్రమవొద్దులేండి నేనే వెడతాను నో నో వెళ్ళొస్తాను'' అంటూ విలాసంగా వెళ్ళిపోయాడు కుమార్

సుజాత హాయిగా నిట్టూర్చి తిరిగి పని చూసుకోసాగింది.

''సుజా ! ఇంక కట్టెయ్ నీ లెడ్జర్ని'' కళ్యాణి గొంతువిని తలెత్తింది సుజాత

''అప్పుడే రెండయిందా ?''

''ఆ''

సుజాత పుస్తకం మూసేసి కళ్యాణి వెంట వెయిటింగ్ రూమ్లోకెళ్ళింది

సుజాతా, కళ్యాణి ఒక మూలగా కూర్చుని టిఫిన్ బాక్సులు ఓపెన్ చేశారు

టిఫిన్ తింటూ కళ్యాణి అడిగింది ''పొద్దున్న కుమార్ వచ్చినట్లున్నాడే ?''

కళ్యాణి మాటకి సుజాత వులిక్కిపడింది

'అతనన్న మాటలు కూడా కళ్యాణి విన్నదా ? ఛ ! కుమార్ తన పరువుమర్యాదలు మంటగలుపుతున్నాడు ఈసారి అతను గనుక కలిస్తే ప్యూన్చేత గెంటించాలి' అని అనుకుంది

''కుమార్ చక్కగా హీరోలా వుంటాడే'' అంది కళ్యాణి నవ్వుతూ

ఆ మాటకి సుజాత ముఖం చిట్లించింది కళ్యాణి కుమార్ని చూసి హీరో అంటోంది మరి, శ్రీనివాస్ని చూస్తే ఏమంటుందో ? హీరోలకు హీరో అంటుందా ?

''ఏం సుజాతా మాట్లాడవ్ ?''

''నువ్వు కుమార్ పేరెత్తకుండా వుంటే మాట్లాడతాను ''

''ఎందుకే అతనంటే నీకంత కోపం ? పాపం ప్రతిరోజూ రెగ్యులర్గా బ్యాంక్కి వస్తున్నాడు గదా ?''

''కళ్యాణి ! ఇంకోసారిగనుక ఆ రోగ్ సంగతి నా ముందెత్తావంటే నేనసలు నీతో మాట్లాడను '' అంది కోపంగా సుజాత

''అయ్యబాబోయ్ అంతపని మాత్రం చెయ్యకే అతన్నిగూర్చి మాట్లాడ్డం మానేస్తానుగానీ ముందు నువ్వు శాంతంగా కూర్చుని టిఫిన్ తిను'' అంది కళ్యాణి

సుజాత తలొంచుకుని తినసాగింది మిగతా లేడీ స్టాఫ్ టిఫిన్ పూర్తిచేసి ఖాళీ బాక్సులు పట్టుకుని బయటకు వెళ్ళింతర్వాత —

''కళ్యాణీ ! పెళ్ళివారి దగ్గర్నుంచి ఏమైనా వర్తమానం వచ్చిందా ?'' అని అడిగింది సుజాత

ఆ మాటతో, అప్పటివరకూ నవ్వుతూవున్న కళ్యాణి ముఖం అదోలా ఐపోయింది !

''అదేవిటే అలా ఐపోయావ్ ?''

కళ్యాణి నవ్వేసి —

''అబ్బే ఏంలేదే ? వుత్తరం మాత్రం వచ్చింది'' అని అంది.

''ఏవని రాశారు'' ఆత్రుతగా అడిగింది సుజాత

''రెండు ముక్కల్లో చెప్పే విషయం కాదే సాయంత్రం చెబుతాను ''

సుజాత తెల్లబోయి 'ఏం జరిగిందో' అనుకుంటూ లేచి వాష్ బేసిన్లో చెయ్యి కడుక్కుంది.

సాయంత్రం ఐదు గంటలకి బ్యాంక్ క్లోజ్ చేశాక ఇద్దరూ బయట కొచ్చారు

''ఎక్కడికి వెడదాం ?'' అనడిగింది సుజాత

''ముందు హోటల్ కెళ్ళి టిఫిన్ చేద్దాం లేకపోతే నా కథ విని నువ్వు కళ్ళు తిరిగి పడిపోతావ్'' అంది కళ్యాణి నవ్వుతూ.

''సరే పద'' అని సుజాత రోడ్డుమీద పోయే రిక్షాని పిలిచింది

''రిక్షా ఎందుకే,''


# జాతీయ భాషా సమైక్యతా గ్రంధములు


తెలుగు భాష మాత్రము చదవగలిగినవారు యితర రాష్ట్రములకు పోయి ఆ దేశములో స్థిరపడిన తరువాత వ్యాపారము గాని, విద్యా సంస్థలయందు గాని, ఉద్యోగ సంస్థలయందు గాని ఆ దేశ ప్రజలతో వ్యవహరించుటకు కష్టపడేవారికి, దినచర్యకు ఉపయోగించే వార్తలు చేర్చి, సులభంగా వ్యాకరణ లోపం లేకుండా వ్రాయడానికి, చదవడానికి మరియు ఆ దేశ ప్రజలతో తేలికగా వ్యవహరించుటకు, ఈ క్రింద వివరించబడిన ఉత్తమ గ్రంధములు


| | వెల రూ | | వెల రూ |
|---|---|---|---|
| ఆంగ్ల సంభాషణం-తెలుగు | 7-30 | 30 రోజులలో మరాఠీ భాష | 6-50 |
| 30 రోజులలో ఆంగ్ల భాష | 9-00 | 30 రోజులలో గుజరాతీ భాష | 5-50 |
| 30 రోజులలో మలయాళ భాష | 6-50 | 30 రోజులలో ఒరియా భాష | |
| 30 రోజులలో సంస్కృత భాష | 6-50 | 30 రోజులలో ఉర్దూ భాష | 5-50 |
| 30 రోజులలో హిందీ భాష | 6-00 | 30 రోజులలో తమిళ భాష | 6-00 |
| 30 రోజులలో కన్నడ భాష | 6-00 | 30 రోజులలో పంజాబి భాష | 6-00 |
| 30 రోజులలో బెంగాళి భాష | 4-50 | ఈజీవే టు స్పీక్ ఇంగ్లీష్ | 19-50 |

మీరు పుస్తకాలకు ఆర్డర్ చేసేటప్పుడు పుస్తకాల వెలలో తప్పనిసరిగా సగం అడ్వాన్సుగా పంపాలి మిగతా సొమ్ముకు వి పి గా పంపుతాము

Also learn all our National Languages
in 30 days through your mother tongue

Balaji Publications
103, Pycrofts Road, Madras-600 014




"నువ్వు హోటల్ పేరెత్తేసరికి నాకు ఆకలి జ్ఞాపకం వచ్చిందిగానీ పద పద" అంటూ సుజాత రిక్షా ఎక్కి కళ్యాణికి చోటిచ్చింది

ఐదు నిముషాల్లో హోటల్ ముందాగింది రిక్షా

ఇద్దరూ లోపలకెళ్ళి ఫ్యామిలీ రూమ్‌లో కూర్చున్నారు సర్వర్ రాగానే కళ్యాణి టిఫిన్‌కి ఆర్డరు ఇచ్చింది

సుజాత మాత్రం కళ్యాణి చెప్పబోయే విషయాన్ని గూర్చి ఆలోచిస్తూ వుండిపోయింది !

వారం రోజుల క్రితం కళ్యాణి తన దగ్గర కొచ్చి- "నిన్న వాళ్ళు వచ్చారే" అంది సిగ్గుపడుతూ

ఎర్రబడ్డ కళ్యాణి బుగ్గలనూ, బరువుగా వాలిపోతున్న కళ్లనూ చూసి ఆశ్చర్యపోతూ —

"ఎవరే ?" అంది తను

"అదేనే మొన్న నీకు చెప్పలా ?"

"ఓ పెళ్ళివారా ?" అప్పుడు జ్ఞాపకం వచ్చింది తనకి

"ఎలా వున్నాడే పెళ్ళికొడుకు ? నీకు నచ్చాడా? ఏం చదివాడు ? వుద్యోగం చేస్తున్నాడా ? నిన్ను ఏఏ ప్రశ్నలు వేశాడు ?"

కళ్యాణి నవ్వింది — "అతని ప్రశ్నలకేం గానీ ముందు నీ ప్రశ్నలతో చంపుతున్నావే తల్లీ" అని అంది

"సర్లేగానీ నీ సంగతి చెప్పు"

"వుండవేబాబూ నెమ్మదిగా ఒక్కొక్కటే చెప్తాను అతను బాగానేవున్నాడు ఎమ్ కామ్ ప్యాసయ్యాడు హైదరాబాద్‌లో వుద్యోగం ఎక్కువ ప్రశ్నలు వెయ్యలేదు నేను నచ్చినట్టుగానే చెప్పాడు"

"ఐతే, మా కళ్యాణి త్వరలోనే పెళ్ళికూతు రవుతుందన్నమాట"

"ష్ష్ ఎవరైనా వింటారే" అంది కళ్యాణి

"విననీ ఎప్పటికైనా తెలియవల్సిందేగదా !"

"ఇప్పుడిప్పుడే తెలియడం నా కిష్టంలేదే 'డేట్' ఫిక్స్ అయ్యాక చెప్పొచ్చు"

ఆ రోజంతా ఇద్దరూ పెళ్ళి కబుర్లే చెప్పుకున్నారు

కుదిరిన ఆ పెళ్లి తప్పిపోయిందా ? లేక, ఏవైనా అడ్డంకులు వచ్చాయా ? ఇప్పుడు కళ్యాణి ఏం చెబుతుంది ! తనేం వినవలసివస్తుంది

సుజాత ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ —

"ఏవిటే ఆలోచనా ! టిఫిన్ వచ్చింది ముందు కానియ్" అంటూ కళ్యాణి, సుజాతను కదిపింది

సుజాత సిగ్గుపడిపోయి టిఫిన్ చేసింది

బిల్లు చెల్లించి బయటకొచ్చింతర్వాత, ఇద్దరూ పార్కులోకొచ్చి ఒకమూలగా కూర్చున్నారు

"ఆ ఇప్పుడు చెప్పు నీ గాధ ?" అంది సుజాత

"సుజాతా ! ఆ సంబంధం తప్పిపోయిందే"

ఇటువంటిదేదో జరిగివుంటుందని వూహించిన సుజాత ఆ మాటకి పెద్దగా ఆశ్చర్యపడకుండానే — "ఎందుకిలా జరిగింది కళ్యాణి ?" అని అడిగింది

కళ్యాణి తలెత్తి సుజాత ముఖంలోకి చూసి — "సుజా ! నిజంగా నా గురించి నీకు తెలుసుకోవాలనుందా ?" అని అడిగింది

"ఛా ! అదేం మాటే నువ్వు నా స్నేహితురాలివి నీ కష్టాలు నావికాదా ?"

"సుజా ! నా కథ విన్నతర్వాత నువ్వు నన్నసహ్యించుకోవద్దు నా బాధలూ, నా కష్టాలూ నువ్వర్థం చేసుకోవడానికి ప్రయత్నించు అంతేగానీ, నువ్వు మరోరకంగా వూహించుకుని నన్నపార్థం చేసుకుంటే ఆ బాధను నేను భరించలేను"

ఆ మాటకి సుజాత చలించిపోతూ ఆప్యాయంగా కళ్యాణి చేతిని తన చేతిలోకి తీసుకుని — "నువ్వు నా స్నేహితురాలివి నిన్ను అపార్థం చేసుకునేపాటి నీచురాల్ని కాదు చెప్పు" అని అన్నది

ఆ ఇద్దరిమధ్యా కొన్ని సెకన్లపాటు నిశ్శబ్దం ఆ నిశ్శబ్దాన్ని బ్రద్దలుకొడుతూ కళ్యాణి చెప్ప సాగింది నెమ్మదిగా —

"సుజాతా ! ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం ! అన్నాడో మహాకవి అలాగే, మధ్యతరగతి కుటుంబంలో ఏ ఆడపిల్ల కథ చూసినా ఏముంది చెప్పకోవడానికి ! అన్నీ సమస్యలు, చిక్కులు, కన్నీళ్ళు వీటన్నిటికీ మూలకారణం డబ్బులేకపోవడమే నా జీవితం కూడా అంతే మా ఇంట్లో వ్యక్తులు నీకు తెలుసుకదా ! రిటైరై ట్యూషన్లు చెప్తూ కాలక్షేపం చేస్తున్న నాన్న, డిగ్రీ ప్యాసయినా వుద్యోగంలేని అన్నయ్య, చిన్నతమ్ముడు, ఇద్దరు చెల్లెళ్లు రెండేళ్ల క్రితం —

నేను బి ఏ ప్యాసయ్ వుద్యోగ ప్రయత్నంలో వున్నాను ఓ రోజు అమ్మకి విపరీతమైన కడుపు నొప్పి వచ్చింది ఇంట్లో ఎవరూలేరు అప్పుడు అమ్మని నేనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాను డాక్టర్ అమ్మని పరీక్షచేసి — ఇప్పటికే జబ్బు బాగా ముదిరిపోయింది వెంటనే ఆపరేషన్ చెయ్యాలన్నాడు

ఇంట్లో తినడానికేలేదు ఇక, ఆపరేషన్‌నికి డబ్బు ఎక్కడనుంచి వస్తుంది నాన్నా, అన్నయ్యా వచ్చినా వాళ్లు చేసేదేంలేదు ! ఇక నేనే ఎక్కడైనా డబ్బు సంపాదించాలి అప్పటికప్పుడు 'అప్పు' ఎవరిస్తారు ? అని ఆలోచిస్తూవుండగా నా క్లాస్‌మేట్ లత జ్ఞాపకం వచ్చింది లతది సామాన్య కుటుంబమే ఐనా దాని దగ్గర ఎప్పుడూ డబ్బుండేది

పర్సులో నోట్లుచూసి నేనప్పుడప్పుడూ లతతో అంటుండేదాన్ని — "అంత డబ్బు ఎక్కడిదే లతా ?" అని

అప్పుడది నవ్వి — "బుర్రలో తెలివితేటలుంటే చాలే డబ్బు దానంతటదే వస్తుంది" అనేది

ఆ మాటలు అర్థంకాక వెర్రిగా లతకేసి చూసేదాన్ని నన్ను చూసి లత నవ్వుతూ —

"కళ్యాణి ! ఈ లోకంలో డబ్బు ఎక్కడబడితే అక్కడ రాసులుగాపోసి వుంది ఆ డబ్బును ఏరుకోవడానికి కొద్దిగా నేర్పూ, సాహసం వుంటే చాలు నువ్వు క్షణంలో ధనవంతురాలివవుతావు" అని అన్నది

నాకా మాటలు అర్థం కాకపోయినా, నాకు లేని తెలివితేటలూ, సాహసం లతకున్నాయని సంతోషించాను

ఇప్పుడు లత ఒక్కతే నా ఈ కష్టంలో ఆదుకోగలదనిపించింది వెంటనే ఆలస్యం కాకుండా లత దగ్గర కెళ్ళాను లత ఇంట్లోనే వుంది అమ్మ విషయం చెప్పి అర్జెంటుగా ఐదు వందలు కావాలని అడిగాను.

లత అంతా విని—

"కళ్యాణి ! ప్రస్తుతం నా దగ్గర యాభై రూపాయలు మించి లేవు" అంది

ఆ మాట వినడంతోనే నాలో దుఃఖం పొంగుకొచ్చింది లత ఇస్తుందని ఎంతో ఆశతో వచ్చాను బ్యాంక్‌లో ఎన్ని విధాలుగా 'లోన్లు' తీసుకోవాలో అన్ని విధాలుగా తీసుకున్నాను ఇప్పుడెలా ? అవతల అమ్మ ప్రాణాపాయస్థితిలో వుంది వెంటనే ఆపరేషన్ జరగాలి నాకు కాళ్ళూ, చేతులూ చల్లబడ్డట్టయింది ఏ క్షణంలోనైనా షోసొచ్చి పడిపోయే స్థితిలో వున్నాను

"లతా ! ఇప్పుడెలా !" అన్నాను దిగులుగా

"కళ్యాణి ! నీకు డబ్బు ఇవ్వలేనుగానీ, డబ్బు వచ్చే మార్గం మాత్రం చెబుతాను" అని అన్నది

నేను ఆనందంగా లత చేతులు పట్టుకుని—

# డాక్టర్ సలహాలు



డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

### కె. టి. ఎస్. — లక్ష్మీవాడ

ఓరల్ పిల్స్ మాత్రలు వాడితే స్త్రీకి గర్భిణి రాదు అంటారు కదా! ఈ మాత్రలు గర్భిణీ వచ్చిన తర్వాత వాడవచ్చా! వాడితే ఎన్ని నెలల వరకూ పనిచేస్తాయి?

★ అర్థంలేని ప్రశ్న గర్భం రాకుండా ఉండటానికే కదా ఈ మాత్రలు వాడేది గర్భం వస్తే ఎందుకు వాడాలి? గర్భం వచ్చిన తర్వాత ఈ మాత్రలను వాడితే హానికరమనే చెప్పవలసి ఉన్నది

### సి. ఎమ్. — నాయుడుపేట

నాకు 24 సంవత్సరములు నా కాళ్ళయందు తెల్లగా అక్కడక్కడా తెల్లని మచ్చలు వున్నవి ఎన్ని మందులు వాడినా ప్రయోజనం కనిపించలేదు స్కిన్ స్పెషలిస్టుకు గూడా చూపించినాను తెల్లని మచ్చలు పోవుటకు ఏమి చెయ్యవలెనో తెల్పండి

★ దీనిని విటలైగో అని అంటారు ఇది పుట్టుకతో ఏర్పడుతుంది కొందరికి పుట్టినప్పటి నుంచి లేకపోయినా కొన్ని సంవత్సరముల తర్వాత ఈ మచ్చలు బహిర్గతం కావచ్చు దీనికి ప్రత్యేక చికిత్స ఏదీ లేదనే చెప్పాలి సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ రిసెర్చి ఇన్ ఆయుర్వేదా అండ్ సిద్దా అనే సంస్థలో కొన్ని మందులు వాడి ప్రయోగాలు చేయబడ్డాయి వీటి విభాగాలు దేశంలో చాలా ప్రాంతాలలో ఉన్నాయి విజయవాడలోను, మద్రాసులోను వీటి శాఖలు ఉన్నాయి

### ఆర్. ఆర్. ఎల్. — హైదరాబాద్

నా వివాహం జరిగి ఎనిమిదేళ్ళు అయింది ఇంతవరకూ సంతానం కలుగలేదు సెమెన్ టెస్టు మావారు రెండు మూడుసార్లు చేయించిన సరి అయిన ఫలితం రాలేదు. రెండు మూడ సార్లు ఆయన ఇచ్చినది సరిగా లేదని డాక్టర్లు తెలిపారు టెస్టు అనగానే చేయించలేకపోతున్నానని మావారంటున్నారు సెమెన్ టెస్టు ద్వారా కాక మరే ఇతర పరీక్షల ద్వారానైనా మగవారు టెస్టు చేయించుకోవచ్చా?

★ మగవారికి సెమెన్ టెస్టు మినహా మరే ఇతర పరీక్షలు లేవు

### బి. ఆర్. ఎస్. — గూడూరు

నా వయస్సు 17 సం॥లు నాకు గత నాలుగు సం॥లుగా చర్మంలో గుల్లలు లేచి తర్వాత తెల్లమచ్చలగుచున్నవి అవి జిలగా కూడా ఉంటాయి ఎన్ని మందులు వాడినా, వాడినన్ని రోజులు తగ్గి, ఆపగానే మరలా వస్తున్నాయి ఎండాకాలం ఎక్కువ బాధగా ఉంటుంది

★ మీరు వైద్యులచేత స్టెఫ్లో - స్టెఫీలో వాక్సిన్ వరుసగా అయిదు వారాలపాటు వేయించుకోవటం మంచిది అప్పటికీ నయం కానప్పుడు మీ చర్మంలోని "గుల్లల" నుంచి వచ్చిన "చీము"తో తయారుచేసిన ఆటో వాక్సిన్ వాడితే నయమవుతుంది

### వై. యస్. ఎన్ — సామర్లకోట

సాధారణంగా డిసెంబర్ మొదలు జూన్ వరకు చికెన్‌పాక్స్ వస్తూ వుంటుంది దీనికి మందుల లేవు అంటారు నిజమేనా? మందులు వేసుకోకూడదంటారు ఇది ఎంతవరకూ నిజం?

★ చికెన్‌పాక్స్, స్మాల్‌పాక్స్, మీసిల్స్, మంప్స్, ఇన్‌ఫ్లుయెంజా, ఇన్‌ఫెక్టివ్ హెపటైటిస్, పోలియో, జలుబు మొదలయిన రోగాలన్నీ వైరస్‌ల వల్ల ఏర్పడతాయి ప్రపంచంలో ఇంతవరకు వైరస్‌లను నాశనం చేసే మందులు కనుగొనబడలేదు అందువల్ల ఈ రోగాలన్నీ తమంతట తామే తగ్గిపోవటం జరుగవలసి ఉంటుంది ఈ వైరస్‌లు శరీరంలో ఉన్న సమయాలలో బాక్టీరియాలవల్ల కొన్ని రోగాలేర్పడే అవకాశం ఉంటుంది ఆ రోగాలకి యాంటీబయాటిక్ మందులు పనిచేస్తాయి

వైరస్‌లవల్ల రోగాలు వస్తే అసలు మందులే వాడకూడదనటంవల్ల ఎంతోమందికి ప్రాణాపాయం ఏర్పడుతున్నది ★

---

"చెప్పు లతా! నువ్వేం చెయ్యమన్నా చేస్తాను నాకు డబ్బు మాత్రం కావాలి ఆ డబ్బుతో అమ్మకి ఆపరేషన్ చేయిస్తాను చెప్పు లతా" అన్నాను

"కళ్యాణీ! ముందుగా నేను చెప్పేది విను ఆ తర్వాత నీ ఇష్టప్రకారం చెయ్యి ఈరోజుల్లో ఒక్కసారిగా అంత డబ్బు కావాలంటే ఎవరూ ఇవ్వరు ఒకవేళ ఇచ్చినా ఆ డబ్బు వెనుక స్వార్థం తప్పకుండా వుంటుంది ఇది నేను అనుభవంగా తెలుసుకున్న సత్యం ఈ సత్యం వెనుక ఆపదలో ఆదుకునేవాడు ఒక్కడే వున్నాడు ఆ ఆపదమొక్కులవాడు ఒక ఫొటోగ్రాఫర్ అతను 'న్యూడ్స్' తీసి అమ్ముతుంటాడు అది చాలా పెద్ద బిజినెస్ ఒక్కో ఫొటోకి రెండు వందల రూపాయలిస్తాడు నీ కిష్టమైతే అతని దగ్గరకు తీసుకెడతాను"

లత చెప్పిన మాటలు వినడంతోనే నాకు నోట మాట రాలేదు లతకి ఇంత ఖరీదైన చీరలూ, నగలూ, డబ్బు ఎక్కడనుంచి వస్తున్నాయో ఇప్పుడు తెలిసింది లతకేసి ఆశ్చర్యంగా చూస్తుండిపోయాను!

"కళ్యాణీ! నీకు నామీద అసహ్యంగా వుంది కదూ? చెట్టునీడలో వుండేవాడికి ఎండలో నడిచేవాడి కష్టం తెలియదు ఎండలో నడిచేవాడు ఎలాగో అలా చెట్టునీడకి చేరాలని ప్రయత్నిస్తాడు

## ఇది సంధ్యా సమయం

కానీ, అతనికి చోటివ్వకుండా ఆ నీడలో నిలబడ్డ వ్యక్తులు హేళనగా అతన్ని చూస్తూ ఆనందిస్తూ వుంటారు అదిగో, అటువంటివారిదే తప్పు నా పరిస్థితి కూడా అటువంటిదే నాకూ ఎన్నో కోరికలున్నాయి కానీ, వాటిని తీర్చుకోవడానికి డబ్బు లేదు అందుకే, అవకాశం వచ్చింది, వుపయోగించుకున్నాను తప్పొప్పుల నిర్ణయంతో నాకు పనిలేదు నా జీవితాన్ని సుఖమయం చేసుకోవాలనుకున్నాను చేసుకుంటున్నాను దాంతో నా కోరికలూ, నా సరదాలూ తీర్చుకుంటున్నాను అంతే!"

నేను ఆశ్చర్యంగా వింటున్నాను

"కళ్యాణీ! మొదట్లో కొద్దిగా భయంగా వుంటుంది ఆ తర్వాత అదే అలవాటవుతుంది కళ్యాణీ! మనందరి బ్రతుకులు అంతేనే ఏం చేస్తాం? పరిస్థితులకు తల వంచక తప్పదు ఆలోచించు" అంది

ఏం ఆలోచించను?

ఒక ప్రక్క అమ్మ!

మరో ప్రక్క అవినీతి!!

"ఆకలి కడుపుకి అన్నీ ఆహుతయిపోతాయ్ కళ్యాణీ! నువ్వింత ఆలోచిస్తున్నావు కానీ కేవలం ఆనందం కోసం, థ్రిల్ కోసం ఇటువంటి పనులు చేసేవారు చాలామంది వున్నారు కళ్యాణీ! నీతి నియమాలకంటే ప్రాణం ముఖ్యం అందులోనూ కన్నతల్లి ప్రాణం ముఖ్యం లోకంలో ఏ వస్తువునైనా కొనొచ్చుకానీ తల్లిని కొనలేం"

ఆ చివరి వాక్యంతో నా తల తిరిగిపోయింది అవును జన్మనిచ్చిన తల్లి తరువాతనే ఏదైనా!

లత వెంట స్టూడియోకి వెళ్ళాను

లత ఆ ఫొటోగ్రాఫర్‌తో మాట్లాడింది అతను నా వేపు చూసి చిన్నగా నవ్వి — "రండి" అన్నాడు

లత బయటే వుంది

నేను అతని వెంట లోపలి గదిలోకి వెళ్ళాను

అతను చెప్పినట్టు మరబొమ్మలా వేశాను

అతను రకరకాల పోజుల్లో నా ఫొటోలు తీసి బయటకెళ్ళిపోయాడు

నేను బట్టలేసుకుని బయటకొచ్చాను

"లతా! బ్యూటీఫుల్ స్ట్రక్చర్ కుర్రాళ్ళు చూశారంటే వెర్రెత్తిపోతారు" లతనంటున్నాడు

నేను నిర్లిప్తంగా వుండిపోయాను అతనిచ్చిన వెయ్యి రూపాయలు తీసుకొని బయటకొచ్చాను

(ఇంకా ఉంది)

పెద్దకథ:

# ఇది సంధ్యాసమయం

నందం రామారావు



(గత సంచిక తరువాయి)

అమ్మకి ఆపరేషన్ జరిగింది.

అప్పటికి ప్రాణగండం గడిచినా, ఆరునెలలకి ఏ గండం లేకుండానే అమ్మ ప్రాణం గాలిలో కలిసిపోయింది. ఆ తర్వాత, మరో ఆరునెలలకి నాన్న రిటైరు కావడం, నాకీ వుద్యోగం రావడం జరిగింది. ఇప్పుడా గొడవలన్నీ ఎందుగ్గానీ — సుజా! ఆ ఫోటోనే ఇప్పుడు నా జీవితాన్ని నిప్పుల గుండంలోకి తోశాయి. సుజా! ఇది చూడు.'' అంటూ కళ్యాణి తన బ్యాగ్ లోంచి ఒక వుత్తరం తీసి సుజాత చేతిలో పెట్టింది.

''ఏమిటిది?''

''చదువు''

సుజాత ఆ వుత్తరం తీసి చదవసాగింది

''కళ్యాణిగారూ,

మిమ్మల్ని చూశాక ఎప్పుడు మన పెళ్ళి జరుగుతుందా అని ఆరోజు కోసం ఆరాటంతో ఎదురు చూడసాగాను. మీకు చెప్తే నమ్మరు రాత్రుళ్ళు నిద్ర పట్టడం కూడా మానేసింది. ఒక్కొక్క రోజు గడుస్తుంటే మనం దగ్గరవుతున్నామనే ఆనందం. నా స్థితి నాకే ఆశ్చర్యంగా వుండేది. ఇక అసలైన విషయానికొస్తాను. మొన్న సాయంత్రం ఒక ఫ్రెండ్ ఇంటికి వెళ్ళాను. వాడు ఏదో కబుర్లు చెప్తూ — ''రీసెంట్‌గా కొన్నార్రా!'' అంటూ కొన్ని 'న్యూడ్స్' చూపాడు. వాడి టేస్ట్ నాకు తెలుసు. అందుకే అవి తీసుకుని ఒకటొకటే తీసి చూస్తున్నాను. వాడు ఏవేవో వర్ణనలు చేస్తున్నాడు. జోక్స్ వేస్తున్నాడు. ఆ ఫోటోలు చూస్తున్న నాకళ్ళు హటాత్తుగా ఆగిపోయాయి. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. అది మీ ఫోటో. మీ కళ్ళకు నల్లని గుడ్డ కట్టివుంది. మీరు నగ్నంగా, స్త్రీ వేటినైతే రహస్యంగా దాచుకోవాలను కుంటుందో వాటిని స్పష్టంగా చూపుతూ నిలబడ్డారు. వాడు ఫోటోని చూస్తూ ఏవేవో కామెంట్స్ విసురుతున్నాడు. నేను వినలేకపోయాను. ఫోటోలు అక్కడ పడేసి వాడు పిలుస్తున్నా వినిపించుకోకుండా వచ్చేశాను.

కళ్యాణిగారూ! మీరు ఏ పరిస్థితిల్లో ఆ ఫోటోలు తీయించుకున్నారో నాకనవసరం. నాక్కాబోయే భార్య సౌందర్యాన్ని నేనే చూడాలి. పరాయి మగాడి ముందు అలా నిలబడ్డ స్త్రీని నేను నా భార్యగా స్వీకరించలేను. మీకు బాధ కలిగిస్తే నన్ను మన్నించండి. శెలవ్.

మోహన్రావు.''

సుజాత ఉత్తరం మడిచి కళ్యాణివేపు చూసింది.

కళ్యాణి కళ్ళల్లో నీటిబిందువులు.

సుజాత అది చూసి చలించిపోతూ ఆప్యాయంగా కళ్యాణి చేతిని పుచ్చుకుని — ''కళ్యాణీ! ఏడవకే'' అంది.

కళ్యాణి కొంగుతో కళ్ళు తుడుచుకుని—''ఏడవడం లేదే. చేతులారా చేసుకున్నదానికి ఏడుపెందుకే. మోహన్రావు జ్ఞాపకం వచ్చి క్షణకాలం బాధ కలిగింది.''

''కళ్యాణీ!''

''అవునే సుజా! చిన్నప్పుడు మా మాస్టారు అంటుండేవారు — కష్టాల్లో కూడా నవ్వేవాడే

మనిషిని. చూడు సుజా! ఈ జీవితం ఎంతో చిన్నది. చాలా విలువైనది కూడానూ. జీవితమంతా కన్నీటితోనే గడిపితే చివరి నిముషాల్లో పశ్చాత్తాప పడాల్సివస్తుంది."

"కల్యాణీ! ఇప్పుడెలా ? పోనీ, ఆ స్టూడియో కెళ్ళి ఆ నెగెటివ్‌లు తీసుకొచ్చేద్దామా ?"

సుజాత మాటలకు పకపకా నవ్వింది కళ్యాణి.

"సుజా! నువ్వెంత అమాయకురాలివే. మనం అడిగితే ఇస్తాడా ? డబ్బిచ్చికొనుక్కున్నాడు. ఐనా ఇప్పుడు నా ఫొటోలు దేశమంతా వ్యాపించి వున్నాయి. ప్రతి కుర్రాడి దగ్గరా అవే వుండి వుంటాయి."

సుజాత ఆవేదనగా చూసి — "కల్యాణీ! ఇక నీ పెళ్ళి ఎలా అవుతుందే ?" అన్నది.

"అవుతుందే. నా దగ్గర లక్షలాది రూపాయ లుంటే పెళ్ళవుతుంది. నేనెన్ని తప్పులు చేసినా తుడిచిపెట్టుకుపోతాయి. అంత డబ్బు నా దగ్గర లేదుగనుకనే నాకు పెళ్ళి కాదు."

గుండెల్ని బ్రద్దలుచేసే మాటల్ని కూడా అంత తేలిగ్గా చెప్తున్న కళ్యాణిని చూస్తుంటే సుజాతకి ఆశ్చర్యం కలిగింది.

కళ్యాణి స్థానంలో ఇంకో ఆడపిల్ల గనుక వున్నట్టయితే ఈపాటికి ఆత్మహత్య చేసుకుని వుండేది!

"కల్యాణీ..." అంటూ బాధగా ఏదో చెప్ప బోయింది.

అప్పుడు కళ్యాణి కోపంతో — "సుజాతా! అంతలా బాధపడడం మంచిదికాదు. ఐనా, ఇప్పుడు నాకేం తక్కువయిందని ? మంచి వుద్యోగం వుంది. మంచి స్నేహితురాలిగా నువ్వున్నావ్. ఇదికూడా లేనివాళ్ళు ఈ దేశంలో కోకొల్లలుగా వున్నారు. అంచేత నువ్వింకేం చెప్పమాకు."

సుజాత చిన్నగా నిట్టూర్చి —"అవును కళ్యాణీ! నువ్వు చెప్పింది నిజమే. అటువంటివాళ్ళను చూసి జాలిపడడం తప్ప మనం ఏం చెయ్యగలం ?" అన్నది.

కళ్యాణి ఏదో ఆలోచిస్తూ మౌనంగా వుండి పోయింది!

నిముషాలు గడుస్తున్నాయి. సుజాత హఠాత్తుగా అడిగింది —

"మీ అక్క ఎలా వుంది కళ్యాణీ ?" అని.

"అలాగే వుంది. ఇప్పుడవన్నీ ఆలోచిస్తుంటే మన మనస్సు ఇంకా పాడవుతుంది. అప్పుడే ఏడు గంటలు కావస్తోంది. ఇక పోదాం పద" అంది కళ్యాణి లేస్తూ.

సుజాత కూడా లేచింది.

"కళ్యా !" అంటూ ఏదో చెప్పబోయి కళ్యాణివేపు చూసి ఆగిపోయింది సుజాత.

సుజాత చెప్పబోయే విషయాన్ని గ్రహించిన కళ్యాణి —

"సుజాతా! జాగ్రత్తగా ఇంటికెళ్ళు. కడుపు నిండా తిని హాయిగా నిద్రపో. పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకుని నిద్ర పాడుచేసుకోకు" అని అన్నది.

సుజాత 'అలాగే' అన్నట్టు తలూపి రోడ్డుమీద కొచ్చి రిక్షా పిలిచి —

"కళ్యాణీ! ఆ రిక్షాలో నువ్వెడతావా ?" అని అడిగింది.

"నేను ఆటోలో వెడతాను. నువ్వెళ్ళు" అంది కళ్యాణి.

సుజాత రిక్షా ఎక్కింది.

కళ్యాణికైతే తేలిగ్గా మాటైతే యిచ్చిందిగానీ ఆ రాత్రంతా కళ్యాణిని గురించిన ఆలోచనలతో నిద్రపట్టలేదు సుజాతకి!

కళ్యాణి కొంచెం నలుపే అయినా కళకళలాడే ముఖం. కళ్యాణిలో ఎక్కువ ఆకర్షించేది ఆమె నవ్వు. కొద్దిగా పెదవులు తెరచి, తెల్లని పలువరుస తళుక్కుమనేట్టు కళ్యాణి నవ్వితే ఎంతటివాళ్ళైనా ముగ్ధులై చూడవల్సిందే!

కళ్యాణి తనకన్నా ముందునుంచే బ్యాంక్‌లో వర్క్ చేస్తోంది.

తను బ్యాంక్‌లో చేరిన మొదటి రోజు. లంచవర్లో లేడీస్ అందరితోపాటు తనూ రూమ్‌లో కెళ్ళింది. కాని, ఆ రోజు తినడానికి తనేం తెచ్చుకోలేదు. బిడియంగా ఒక మూల కూర్చుండిపోయింది.

అప్పుడు కళ్యాణి తన దగ్గరకొచ్చి — "మీరు కొత్తగా జాయినయ్యారనుకుంటాను" అంటూ తన ప్రక్కన కూర్చుని తనతో మాట కలిపింది.

కళ్యాణి బాక్స్ తెరచి, తినడానికి తెచ్చుకున్న దానిలో తనక్కూడా కొంత పెడుతూ — "ఇక్కడ క్యాంటిన్లో టిఫిన్ బాగుండదు. అందుకని రోజూ మేము లంచ్ బాక్స్‌లు తెచ్చుకుంటాం" అంది

ఆ సాయంత్రం తనతోపాటు బస్సుస్టాపువరకూ వచ్చింది. దారిలో అంది —

"సుజాతా! మిమ్మల్ని చూడగానే ఎందుకనో మీతో స్నేహం చేసుకోవాలన్పించింది. అదీ మీ కిష్టమైతేనే సుమండీ."

కళ్యాణి మాటలకు తను చాలా సంతోషించింది. ఆ రోజునుంచీ తామిద్దరూ మంచి స్నేహితు రాళ్ళయ్యారు. తమ మధ్య ఎటువంటి దాపరికాలూ వుండేవికావు!

## మంత్రుల జీతాల్లో కోత!

పశ్చిమ జర్మనీ కొత్త ప్రభుత్వం ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించేందుకు సన్నాహాలను ప్రారంభించింది. ఇందులో తొలి చర్యగా మంత్రుల జీతాల్లో అయిదు శాతం కోత విధించారు. అందరూ కొంత మేరకు "త్యాగాలు" చేయవలసి ఉంటుందని నూతన అధ్యక్షులు శ్రీ కోహిల్ అన్నారు. ఉద్యోగుల జీతాల పెంపును ఆరునెలల పాటు వాయిదా వేశారు. ఇది పింఛనుదారులకు కూడా వర్తిస్తుంది. మంత్రుల జీతాల్లో విధించిన అయిదుశాతం కోతవలన బడ్జెటు లోటును పూడ్చడం సాధ్యంకాదు. అయితే ఇది అందరికీ మార్గ దర్శకంగా ఉంటుందని ఆయన అన్నారు. ప్రతిపక్షం వారు మాత్రం దీనిని కన్నీటి తుడుపు చర్యగా అభివర్ణించారు. దీని ద్వారా సాధించిన పొదుపు అదనపు కార్య దర్శుల నియామకం వలన తుడిచి పెట్టుకు పోయిందని వారన్నారు.

అమ్మ అప్పుడప్పుడూ అంటుంది—"ముత్యాలన్నీ ఒకచోట, మట్టిబెడ్డలన్నీ ఒకచోట చేరతాయని."

అలాగే కళ్యాణీ, తనూ ఇద్దరూ దురదృష్ట వంతులే. ఇద్దరికీ సుఖపడే గీత లేనట్టుంది.

కళ్యాణి అన్నట్టు —

అవును! తనలాటివాళ్ళు కష్టాల్లో కూడా నవ్వడం నేర్చుకోవాలి. లేకపోతే బ్రతకడం చాలా కష్టం!

ఆలోచనలతో ఎప్పుడో నిద్రపోయింది సుజాత

* * *

ఆ రోజు కొద్దిగా పనుండి సుజాత నాలుగ్గంటలకే ఏజంట్‌గారిని పర్మిషన్ అడిగి బస్సెక్కి బజార్లో దిగింది. తనకు కావలసినవి కొనుక్కుని, తిరిగి బస్సుస్టాపు దగ్గరకొచ్చి నిలబడిందో లేదో టపటపా చినుకులు ప్రారంభమై చూస్తుండ గానే వర్షం పెద్దదయింది.

రోడ్డు మీదవున్న వాళ్ళందరూ నాలుగు వేపులకూ పరిగెత్తారు.

సుజాతకి ఎక్కడికి వెళ్ళాలో తోచలేదు. ప్రతి షాపులోనూ అంగుళం స్థలం విడవకుండా మనుషులు నిలబడివున్నారు.

ఆడపిల్ల అలా ఒంటరిగా నిలబడి వర్షంలో తడుస్తుంటే వినోదంగా చూస్తున్నారు.

సుజాత నెత్తి మీద నుంచి ముఖం మీదికి నీళ్ళు కారుతున్నాయి. తడిసిన చీర ఒంటికి అతుక్కు పోయింది. సుజాత అయోమయ స్థితిలో అలా స్తంభంలా నిలబడిపోయింది.

ఇంతలో సుజాత ముందొక కారు ఆగింది. ఆ కారులో శ్రీనివాస్ వున్నారు. కారు డోర్ తీస్తూ —

"రండి. త్వరగా వచ్చి కారెక్కండి!" అన్నాడు.

సుజాత సంకోచిస్తూ అలాగే నిలబడివుంది.

"మిమ్మల్నే. మీరొస్తారా ? నన్ను దిగి రమ్మంటారా ?

సుజాత గబ గబా వెళ్ళి కారులో కూర్చుంది. శ్రీనివాస్ కారు స్టార్ట్ చేసి — "ఒక ప్రక్క అలా తడిసిపోతూ కారులో ఎక్కనంటారేవండీ. మై గుడ్‌నెస్. మీ తల చూడండి ఒక చిన్న చెరువులా తయారయింది. వెనుక సీటులో టవలుంది. అది తీసుకుని తుడుచుకోండి!" అన్నాడు.

సుజాత టవల్ తీసుకుని తుడుచుకోసాగింది. కారు మెత్తగా వెడుతోంది. ఆమెకిదంతా ఇంద్ర జాలంలా వుంది!

తను శ్రీనివాస్ ప్రక్కనకూర్చుని అతని కారులో వెడుతోంది!

ఇది కలకాదు నిజం!

శ్రీనివాస్ వేపు చూసింది.

అతని కుడిచేయి స్టీరింగ్ మీదుంది.

ఎడమచేయి ఒళ్ళో వుంది.

అతని దృష్టి రోడ్డు మీదుంది.

ఆ కళ్ళు, నుదుట మీదపడే ఆ వంకీ జుట్టు, వంపు తిరిగిన ఆ గడ్డం .. ఎంత బాగున్నాడు.

"బజారు కొచ్చారా ?" శ్రీనివాస్ ప్రశ్నించాడు.

సుజాత వులిక్కిపడి —

"ఆ!" అంది తడబడుతూ.

"వచ్చిన పని పూర్తయిందా ?"

''ఆ''

''మా నాన్నగారు రోజుకొక్కసారైనా మీ కుటుంబాన్ని గురించి చెప్పందే నిద్రపోరు. ముఖ్యంగా మీ గురించి ఎక్కువ చెబుతుంటారు. ఇంత చిన్న వయస్సులో కుటుంబ బాధ్యతల్ని నెరవేర్చుకుంటూ వస్తున్నారని మిమ్మల్నెప్పుడూ పొగడుతూ వుంటారు.''

శ్రీనివాస్ ఏదేదో చెబుతున్నాడు కానీ ఆ మాటలేవీ సుజాత వినటంలేదు

శ్రీనివాస్ కంఠంలోని మాధుర్యానికి తన్మయత్వం చెందుతోంది సుజాత.

కారు ఒక హోటల్ ముందాగింది.

శ్రీనివాస్ వెనుక సీటులోవున్న ఫ్లాస్కు తీసుకుని హోటల్‌కెళ్ళి రెండు కప్పుల టీ పోయించుకొచ్చి, దాన్ని గ్లాసులో పోసి సుజాతకిస్తూ – ''తీసుకోండి'' అన్నాడు.

''మరి మీరు . '' అంది సుజాత అతనివేపు చూస్తూ

''నేనూనూ. మీకు తెలియదేమో నేను చాలా స్వార్థపరుడినండోయ్'' అన్నాడు శ్రీనివాస్ నవ్వుతూ.

అబ్బా! శ్రీనివాస్ ఎంత బాగా నవ్వుతాడు!

అతన్నే చూడసాగింది సుజాత.

''చల్లారిపోతోంది. ముందు త్రాగండి.''

సుజాత గ్లాసును పెదవుల కానించుకుంది. త్రాగడం పూర్తయ్యాక కారు స్టార్ట్‌చేశాడు.

''మీ అమ్మగారు బావున్నారా ?''

''ఆ.''

''ఆ రోజు మీ అమ్మగారు చాలా వీక్‌గా కన్పించారు. జాగ్రత్తగా చూస్తుండండి.''

సుజాత తలూపింది.

ఆ తర్వాత శ్రీనివాస్ తాము కట్టబోయే క్రొత్త నర్సింగ్‌హోమ్ గురించి మాట్లాడాడు.

సుజాత మౌనంగా వింటోంది.

ఇంతలో చిన్న కుదుపుతో కారు ఆగింది.

సుజాత వులిక్కిపడి చూసింది.

'అరే! అప్పుడే ఇల్లు వచ్చేసిందే;'

సుజాత డోర్ తీసుకుని క్రిందకు దిగింది.

''వస్తానండీ. చాలా థాంక్స్.''

''నో మెన్షన్ ప్లీజ్. గుడ్‌నైట్'' అని శ్రీనివాస్ కారు స్టార్ట్ చేశాడు.

సుజాత మనస్సు గాలిలో తేలిపోతున్నట్టుగా వుంది హుషారుగా నడుచుకుంటూ ఇంట్లో కొచ్చింది.

హాల్లో గీతా, రవీ కూర్చుని చదువుకుంటున్నారు. చేతిలోని ప్యాకెట్లు టేబుల్‌మీద పెట్టి వంటింట్లోకి నడిచింది సుజాత.

జయ స్టవ్ ముందు కూర్చుని అన్నం కలియబెడ్తోంది

''అక్కా!'' అని పిలిచింది

జయ ఇటు తిరిగి చూసింది

జయ కళ్ళు ఎర్ర మందారాల్లా వున్నాయి

ముఖం కమిలిపోయివుంది

ఎంతసేపట్నుంచో ఏడుస్తున్నదానిలా వుంది

ఆ స్థితిలో వున్న అక్కను చూసి తెల్లబోయిన సుజాత –

''అక్కా! అలా వున్నావే?'' అనడిగింది

జయ సమాధానం చెప్పకుండా అటువేపు తిరిగింది. అక్క ధోరణి అర్థంకాలేదు సుజాతకి.

ఎప్పుడూ నవ్వుతూ వుషారుగా వుండే అక్క అలా వున్నదంటే ఏదో విశేషమే జరిగివుండాలి.

ఏవిటో అది ?

అక్కయ్య చెప్పేలాలేదు !

అమ్మ నడిగి తెలుసుకోవాలి.

తల్లి గదిలో కొచ్చిన సుజాత –

కమలమ్మ మంచంమీద కూర్చుని వుండడం, ఆమె కెదురుగా శంకరయ్య కుర్చీలో కూర్చుని వుండడం చూసింది.

శంకరయ్యని చూసి సుజాత వెనుదిరిగివచ్చి హాల్లో కూర్చుంది.

శంకరయ్య కమలమ్మకి దూరపు చుట్టం. అప్పుడప్పుడూ వచ్చి ఏవేవో సంబంధాలు చెప్తుంటాడు ఆ మధ్య జయకి ఏదో సంబంధం తెచ్చాడు. వాళ్ళు వచ్చి చూసివెళ్ళారు. బహుశా, దాన్నిగూర్చి ఏదైనా చెప్పడానికి వచ్చాడేమో. అక్కయ్యకు తొందరగా పెళ్ళయితే తనకు లైన్ క్లియరవుతుంది.

అప్పుడు... తను... సుజాత మనస్సులో శ్రీనివాస్ మెదిలాడు.

శ్రీనివాస్ ఎంత చక్కగా మాట్లాడాడు.

అతనికి తనంటే ఇష్టమేమో ?

లేకపోతే ఎందుకింత అభిమానం చూపుతాడు? ఇన్నాళ్ళూ తను చాలా దురదృష్టవంతురాలని బాధపడుతూ వచ్చింది. కానీ, తనకోసం ఇంతటి సౌభాగ్యాన్ని ఆ దేవుడు దాచివుంచాడని ఇప్పుడు తెలుసుకుంది !

సంతోష తరంగాలు వువ్వెత్తున లేస్తున్నాయి తన ఆనందాన్ని ఎవరితోనైనా చెప్పుకోవాలి ఏ విషయం జరిగినా ముందుగా అక్కయ్యకు చెప్పడం తన కలవాటు. శ్రీనివాస్ విషయం కూడా అక్కకు చెప్పాలి.

కానీ, అక్క ఎందుకలా వుంది ?

శంకరయ్య వచ్చాడంటే మంచి కబురే తెచ్చి వుండాలి. మరి, అక్కయ్య ఎందుకు బాధపడుతోంది ?

అక్కయ్య అలా విచారంగా వుంటే తను క్షణం కూడా భరించలేదు. అక్కయ్య ఎప్పుడూ నవ్వుతూ వుండాలి. అక్కయ్య కొచ్చిన కష్టమేమిటో తెలుసుకుని దాన్ని పోగొట్టాలి

అక్కయ్య బాధకు కారణం తెలుసుకునేవరకూ తన మనస్సు మనస్సులో వుండదు! 'శంకరయ్య ఎప్పుడు వెళతాడా' అని చూస్తూ కూర్చుంది సుజాత.

అరగంట తర్వాత శంకరయ్య వెళ్ళిపోయాడు వెంటనే సుజాత తల్లి గదిలోకెళ్ళింది మంచానికి ఆనుకుని కూర్చున్న తల్లి సుజాతని చూస్తూ –

''వచ్చావా సుజా ?'' అంది

''అమ్మా! అక్కయ్య అలావుందేవిటి ? ఏం జరిగింది ?''

ఆ మాటతో కమలమ్మ ముఖం అదోలా ఐపోయింది.

''అంతా నా రాత తల్లీ .. మీ నాన్నగారితో పాటు నేనూ పోయినా బావుండేది'' అంటూ కళ్ళొత్తుకుంది ఆవిడ


తల్లి ధోరణికి విసుగు చెందిన సుజాత – ''అసలేమైందమ్మా ?'' అనడిగింది.


''మొన్న మీ అక్కయ్యని చూసి వెళ్ళినవారు వుత్తరం వ్రాశారు,''

''ఏమని రాశారు ?''

''ఇదిగో. నువ్వే చూడు'' అంటూ దిండు క్రిందనుంచి వుత్తరం తీసిచ్చింది కమలమ్మ.

సుజాత ఉత్తరం తీసుకుని చదివింది. అందులో నాలుగే వాక్యాలున్నాయి.



'మా అబ్బాయికి మీ రెండో అమ్మాయి నచ్చింది. మీ పెద్దమ్మాయికి వేరే ఎక్కడైనా సంబంధం చూసి త్వరలో పెళ్ళి చేసినట్లయితే, మీ రెండో అమ్మాయిని చేసుకుంటాం. ఇందుకు మీరు అంగీకరించినట్లయితే మిగతా విషయాలు వచ్చి మాట్లాడతాం.'

ఉత్తరం చదవగానే సుజాత ముఖం ఎర్ర బడింది. చేతిలోని వుత్తరాన్ని నలిపేసి వుండలాగా చుట్టి కోపంగా ఒక మూలకు విసిరేసి — "అమ్మా! దీనికేనా మీరందరూ బాధపడడం!" అంది.

సుజాత కంఠం అనుకోకుండా కఠినంగా మారింది.

"అదికాదే..."

"ఇక ఆ సంగతి ఎత్తకండి!"

"పాపం! అక్కయ్య, నీకు తాను అడ్డుగా వున్నానని తెగ బాధ పడుతోంది."

ఆ మాట వినడంతోనే సుజాతకి అక్క మీద చెప్పరాని జాలి కలిగింది.

'అక్కయ్య ఎంత అమాయకురాలు.'

"అక్కయ్యకు నేను చెబుతాలే అమ్మా. నువ్వు బాధపడుతే అక్కయ్య ఇంకా బాధపడుతుంది. నువ్వు మామూలుగా వుండు!"

అక్కయ్యను ఎలా ఓదార్చలా అనుకుంటూ హాల్లోకొచ్చి కుర్చీలో కూర్చుంది.

మనసులో ఆ వుత్తరంలోని వాక్యాలు కదిలాడాయి.

ఒళ్ళు భగ భగ మండింది.

వీళ్ళసలు మనుష్యులేనా ?

సంతలో గొడ్డుని చూసినట్టు చూసివెళ్ళారు. తీరా, చూసి వెళ్ళిన తర్వాత నచ్చలేదని వ్రాశారు. పైగా, తను నచ్చిందట!

వెధవ! ఎవర్ని చూడాలని వచ్చాడో వాళ్ళని చేసుకోవాలిగానీ కనిపించిన ప్రతి అందమైన ఆడపిల్లా నచ్చిందంటే ఎవరూరుకుంటారు. ఈ కోతిని చేసుకోవడానికిక్కడ ఎవరూ సిద్ధంగా లేరు.

ఇంతలో రవి — "అక్కా! ఈ పాఠం చెప్పవూ ?" అంటూవచ్చాడు.

సుజాత తన ఆలోచన్లనుంచి బయటపడి కాస్సేపు వాడికి చదువు చెప్పింది.

ఆ రాత్రి భోజనాలయ్యాక జయ హాల్లో పక్కలు వేసింది. పుస్తకాలు ముందు కూర్చుని కునికిపాట్లు పడుతున్న గీతనీ, రవినీ పడుకోబెట్టి, తను వాళ్ళిద్దరిమధ్యా పడుకుంది జయ.

అంతవరకూ గదిలో కూర్చుని పత్రిక తిరగేస్తున్న సుజాత పుస్తకం ప్రక్కన పడేసి జయ దగ్గరకొచ్చింది. గీతని కొద్దిగా ప్రక్కకి జరిపి తను కూర్చుని —

"అక్కా!" అని మెల్లగా పిలిచింది.

జయ కళ్ళమీదనుంచి చేతులు తీసి సుజాతవేపు చూసి —

"ఏవిటే ?" అంది.

"అక్కా! ఇంకా ఆ వుత్తరాన్ని గురించే ఆలోచిస్తున్నావా ?"

ఆ మాటతో జయ చటుక్కున లేచికూర్చుని— "సుజా! నువ్వా ఉత్తరం చూశావా ?" అనడిగింది.




మలయాళ వార పత్రిక 'మంగళం' వారు భారతదేశంలో పాతుకుపోయినటువంటి వరకట్న దురాచారాన్ని తరిమివెయ్యటానికి కృషి చేస్తున్నారు.

గత రెండు సంవత్సరాలలో ఈ పత్రిక ఆధ్వర్యంలో కేరళలో మొత్తం ఐదు సామూహిక వివాహ మహోత్సవాలు జరిగాయి. తల్లి, తండ్రులకు ఖర్చు లేకుండా, జాతి, మతాలతో సంబంధం లేని విధంగా నాలుగు వందల మంది పైగా దంపతులయ్యారు.

ఈ సామూహిక వివాహాలకు అన్ని వర్గాల మద్దతు లభించింది. వార్తా పత్రికలు కూడా చేయూత నిచ్చాయి.

ఇటీవల 'కాలికట్'లో జరిగిన సామూహిక వివాహాలకి కేరళ హోం మంత్రి వాయలార్ రవి ముఖ్య అతిధిగా విచ్చేశారు ఈ కార్యక్రమాన్ని దూరదర్శన్, ఆకాశవాణి కేంద్రాలు ప్రసారం చేసాయి.

ఈ జంటలకి ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి 'మంగళం' వార పత్రిక వారు క్రొత్త పధకాలను చేపట్టారు. వాటికయ్యే ఖర్చంతా ఆ పత్రికవారే భరిస్తారు.

కాలికట్‌లో జరిగిన సామూహిక వివాహ మహోత్సవంలో దంపతులయిన 17 జంటలను చిత్రంలో చూడవచ్చు.

"ఆ. చూశాను. చూసి చాలా ఆనంద పడ్డాను." అంది వ్యంగ్యంగా.

"అదేవిటే అలా అంటావ్ ?"

"లేకపోతే ఏవిటక్కా ? ఆ వెధవ ఏదో రాస్తే నువ్వూ అమ్మా అలా బాధపడుతూ కూర్చోవడం బావుందా ?"

"అదికాదు సుజా! నేను... నేనే... నీకు... అడ్డుగా..."

"అక్కా! ఆ మాట మరోసారి అన్నావంటే వూరుకోను. నువ్వు నాకు అడ్డేవిటి ? నువ్వు అడ్డు లేకున్నా వాడిని చేసుకోవడానికి నేనేం సిద్ధంగా లేను."

"ఎందుకే అంత కోపం ?"

"కోపం కాదక్కా. బాధ. చూశావా ఆడపిల్ల జీవితం ఎంత నికృష్టంగా తయారయిందో. తను కోరుకుంటే చాలు ఏ ఆడపిల్లైనా సరే వచ్చి వాళ్ళో వాలుతుందని ఈ మగవాళ్ళ భావం ... ఆడపిల్లకి ఒక మనసుంటుందని వీళ్ళను కోరు. అసలు, నీలాటి ఆడపిల్లలుండబట్టే మరీ బ్రతుకులింత అధ్వాన్నమైపోయాయి" అంటూ సుజాత తన కోపాన్ని జయ మీద చూపించింది.

"నేనేం చేశాను ?"

"ఏం చేశావా ? వాడి సంబంధం పోయిందని ఏడుస్తూ కూర్చోలేదూ ?"

"నా గురించి కాదే ఆ బాధ."

"మరి నా గురించా ? అదే వద్దన్నాను. అక్కా! ముందు నీకు పెళ్ళవ్వాలి. నాకో అందమైన బావగారు రావాలి. ఆ తర్వాతనే నా పెళ్ళి. అక్కా! ఏది జరిగినా మనమంచికే అంటారు. అలాగే, ఈ సంబంధం పోవడం కూడా మనమంచికేనేమో. ఇంతకన్నా చక్కటి వ్యక్తి నీకొస్తాడు. అందుకే ఇది తప్పిపోయింది. అక్కా! నువ్వు మామూలుగా ఏమీ జరగనట్టే వుండాలి."

ఈ మాటలకు జయ నవ్వి — "అలాగే వుంటానే సుజా. నీలాటి చెల్లెలుండగా నాకు దిగులెందుకు ?"

"పొగడ్తలొద్దుగానీ, అక్కా! నువ్వు నవ్వుతూ, నవ్విస్తూ వుంటేచాలు" అంటూ చాపమీదకి ఒరిగింది సుజాత.

"అలాగే లేవే!"

సుజాత ప్రక్కకు ఒత్తిగిల్లింది. ఆమె కళ్ళ ముందు శ్రీనివాస్ మెదలుతున్నాడు.

పూలరధంలాటి కారులో శ్రీనివాస్ ప్రక్కన కూర్చుని జీవితాంతం ప్రయాణం చేస్తుంటే బావుంటుంది!

శ్రీనివాస్ జ్ఞాపకాలతో సుజాత శరీరం పులకించిపోయింది. తియ్యని వూహలతో మనస్సు నిండిపోయింది!

* * *

"అక్కా... అక్కా..."

గీత పిలుపుతో సుజాత దుప్పటి తొలగించి

చటుక్కున లేచి కూర్చుంది. ఎదురుగా గీత బిక్క మొగంతో నిలబడివుంది.

''ఏమయింది గీతా !''

''అక్కా ! మరే, అమ్మ బాత్‌రూమ్ దగ్గర పడిపోయిందే.''

సుజాత లేచి దొడ్లోకి పరిగెట్టింది.

జయ తల్లిని ఒళ్ళోవుంచుకుని ఏడుస్తోంది.

తల్లికి స్పృహ లేదు.

''అక్కా ! ఏమయిందే ?''

జయ కొంగుతో కళ్ళు తుడుకుని— ''ఏమోనే. నేను వంటింట్లో వున్నాను. దబ్బున పడ్డట్టు చప్పుడైతే వచ్చి చూద్దునుగదా, అమ్మ ఇలా పడి పోయివుంది.''

''పాయం పట్టక్కా మంచం మీద పడుకో బెడదాం.''

ఇద్దరూ కలసి కమలమ్మని లోపలికి తీసుకొచ్చి మంచం మీద పడుకోబెట్టారు.

''అక్కా ! నేను డాక్టరు గారికి ఫోన్‌చేసి వస్తాను.'' అని సుజాత పక్కింటికెళ్ళి డాక్టర్‌గారికి ఫోన్ చేసింది.

వెంటనే ఫోన్ పలికింది.

''హాల్లో ! ఎవరూ ?''

''నేను డాక్టర్ కామేశ్వరరావుని.''

శ్రీనివాస్ కానందుకు సుజాతకు నిరాశ కలిగింది. కానీ, అటువంటి సమయంలో కూడా తన స్వార్థం చూసుకుంటూ వున్నందుకు తనను తాను తిట్టుకుంది సుజాత !

''ఎవరమ్మా ?''

సుజాత తనను తాను సంబాళించుకుని తల్లి పరిస్థితి వివరించి వెంటనే రమ్మని కోరింది.

ఆయన — ''ఇప్పుడే వస్తున్నా'' అన్నాడు.

అన్నట్టుగా పది నిముషాల్లో వచ్చి, కమలమ్మని పరీక్షించి మందులు రాసిచ్చి —

''అమ్మగారికి పూర్తి విశ్రాంతి అవసరం. మందులు జాగ్రత్తగా వాడండి. పళ్ళూ పాలూ ఇవ్వండి. నేను రోజు విడిచి రోజు వచ్చి ఇంజక్షను నిస్తాను.'' అని చెప్పారు.

నెలాఖరు రోజులు. తన దగ్గరవున్న పాతిక రూపాయలూ ఫీజుగా ఇవ్వబోయింది.

ఆయన నవ్వి —

''నాకు ఫీజేవిటమ్మా వెర్రితల్లీ. అమ్మగారు లేచి తిరిగితే చాలు. వెళ్ళి ఆ డబ్బుతో అమ్మకి కావలసినవి కొను.'' అని చెప్పి కారు స్టార్టు చేసుకుని వెళ్ళిపోయారు.

ఆ పాతిక రూపాయిలూ కాక, కళ్యాణి దగ్గర తీసుకున్న పాతిక రూపాయిలు కూడా ఖర్చయ్యాయి. ఇవేకాక, జయ చేతిమీద వున్న రెండు బంగారు గాజులు కూడా మార్వాడీ కొట్టుకెడితేగానీ కమలమ్మ జబ్బు కొద్దిగా తిరుగుముఖం పట్టలేదు.

''అదేమిటక్కా ? నువ్వా రెండు గాజులు అమ్మకుండా నన్నొక్కటడిగితే ఇచ్చేదాన్నిగదా !''

''చాల్లే ! బయట కెళ్ళేదానివి. నీ చేతికి గాజులు లేకపోతే ఎలా ? ఇంట్లో వుండేదాన్ని నాకు గాజులు లేకపోయినా ఫరవాలేదు.''

## ఇది సంధ్యా సమయం

అక్క ప్రేమకి పులకించిపోయింది సుజాత !

* * *

సుజాత ఈమధ్య తరచు శ్రీనివాస్ గురించే ఆలోచిస్తోంది. ఆ రోజు కన్పించడమే, మళ్ళీ కన్పించలేదు ! ఒక్కసారి కన్పిస్తే ఎంత బావున్ను

సుజాత మనస్సు కొట్టుకుపోసాగింది.

శ్రీనివాస్‌ని ఎలా చూడాలి ?

కమలమ్మకి ఇంజెక్షనివ్వాలన్నా మధ్యాహ్నం వస్తాడు.

పోనీ, హాస్పిటల్ కెడితే ?

ఛీ ! కారణం లేకుండా వెడితే ఏమను కుంటాడు ?

మరెలా ? ఎలా ?

ఓ రోజు ప్రొద్దుటే రవికి చెవి వెనకాల వాచింది.

వాడేడుస్తూ కూర్చున్నాడు.

''ఒరేయ్ ! ఏడవకురా. సుజాతని ఆఫీసుకు పంపి నిన్ను డాక్టర్ దగ్గరికి తీసుకెడతాను'' అంది జయ.

ఆ మాట విని సుజాత వెంటనే అందుకుంది— ''నీ కెందుకే ఆ శ్రమ. ఆఫీస్ టైమ్‌కంటే ముందెళ్ళి డాక్టర్‌గారికి నేను చూపిస్తాలే.''

''సరే. నీ యిష్టం'' అని జయ పనులు చూసుకోసాగింది.

సుజాత త్వరత్వరగా తయారవసాగింది.




ఇన్నిరోజులకు శ్రీనివాస్‌ని చూసే అవకాశం వచ్చింది.

'మళ్ళీ ఒక్కసారైనా కన్పించలేదేమ'ని అడగాలి 'తరచూ కన్పిస్తూ వుండండి' అని చెప్పాలి.

అప్పుడేమంటాడో ?

అందంగా నవ్వుతాడేమో ?

తను అపురూపంగా దాచుకున్న గులాబీ రంగు జపాన్ పాలియస్టర్ చీరకట్టుకుంది. దొడ్లోపూసిన ఎర్రగులాబీనికోసి ఒక ప్రక్కగా జడలో పెట్టుకుంది

''ఎందుకే అంతమంచి చీరిప్పుడు ?'' సుజాతకి అన్నం వడ్డిస్తూ అడిగింది జయ.

''కొన్న దగ్గర్నుంచీ పెట్లోనే వుండి పోయిందిగదా.''

''చాలా బావుందే చీర. ఇవేళ నీకు దిష్టి తగలడం ఖాయం.'' అంది జయ నవ్వుతూ.

అవును ! శ్రీనివాస్ దిష్టే తగులుతుంది.

శ్రీనివాస్ ఈ చీరలో తనని చూసి ఏమంటాడో !

సుజాత గబ గబా అన్నం తింది.

రవిని తీసుకుని రిక్షాలో బయలుదేరింది.

రిక్షా హాస్పిటల్ సమీపిస్తుంటే సుజాత మనసు దడ దడ లాడింది.

రిక్షా నర్సింగ్ హోమ్ ముందాగింది.

రిక్షా దిగుతుంటే కాళ్ళు వణికాయి సుజాతకి. శరీరమంతా ఆదో విధమైన వుద్వేగంతో నిండి పోయింది.

రవితోపాటు లోపలకెళ్ళింది.

''డాక్టర్‌గారున్నారా ?''

''ఆ వున్నారు. కూర్చోండి.'' అన్నాడు కాంపౌండరు.

శ్రీనివాస్ వున్నాడన్నమాట.

పరిసరాల మీద దృష్టి నిలవడం లేదు. లోపలి నుంచి ఎప్పుడు పిలుపు వస్తుందా ! అని తలుపు వేపు చూస్తూ కూర్చుంది ఆత్రుతగా.

పది నిముషాలకు కాంపౌండరు వచ్చి — ''వెళ్ళండమ్మా.'' అన్నాడు.

సుజాత లేచి తడబడుతున్న అడుగులతో తమ్ముడిని తీసుకుని లోపలకెళ్ళింది.

ఎదురుగా కుర్చీలో కూర్చున్న వ్యక్తిని చూసి నిలువునా నీరు కారిపోయింది.

కామేశ్వరరావుగారు సుజాతని చూసి —

''ఏవిటమ్మా ! ఇలా వచ్చావ్ ?'' అంటూ పలకరించారు.

సుజాత తనని తాను సంబాళించుకుని, బలవంతంగా నవ్వి, రవిని గురించి చెప్పింది.

ఆయన, రవిని పరీక్షించి ఇంజక్షనిచ్చి, మందులు వ్రాసిన చీటీ ఇస్తూ —

''ఈ టాబ్లెట్స్ ప్రొద్దున్న ఒకటీ సాయంత్రం ఒకటీ వెయ్యమ్మా'' అని చెప్పారు.

సుజాత అలాగేనంటూ తలూపి, నీరసంగా అడుగులేస్తూ బయటకొచ్చింది.

మనస్సంతా శూన్యమైపోయింది.

ఎన్నో రోజులనుంచీ లంఖణాలు చేస్తున్నదానిలా వుంది.

రవిని రిక్షా ఎక్కించి, జాగ్రత్తగా వెళ్ళమని చెప్పి, తమ బ్యాంకుకొచ్చింది.

## విద్యార్థి లోకం వ్యాస రచన పోటీలో ప్రత్యేక బహుమతి రు.150/-లు పొందిన వ్యాసం

# మా విద్యార్థిలోకం ఆశయాలు

నేటి విద్యార్థులు రేపటి పౌరులు. వారికి సంఘంలో కొన్ని విధులు ఉన్నాయి. సంఘానికి వారి యెడల కొన్ని కర్తవ్యాలు ఉన్నాయి. ఈ విద్యార్థులకు సంఘానికి మధ్య ఉండే సంబంధాన్ని బట్టి వారి ఆశయాలు రూపొందుతాయి. విద్యార్థుల నేటి ఆశయాలను బట్టి రేపటి జాతి పరిస్థితి ఉంటుంది.

విద్యార్థుల ఆశయాలు కూడా కాలానుగుణ్యంగా మారుట తప్పదు. స్వాతంత్ర్యం రాకముందు గాంధీజీ ఉద్యమం నడుపుతున్న రోజులలో ఆనాటి విద్యార్థులు స్వాతంత్ర్యం ముఖ్యం, చదువు దానితర్వాతే అని భావించారు. పాఠశాలలు, కళాశాలలు వదలివేశారు. లాఠీ దెబ్బలు తిన్నారు. చెరసాలలకు వెళ్ళారు. అది ఆనాటి పరిస్థితులనుబట్టి సవ్యమే. కాని ఈనాడు ఆ పరిస్థితి లేదు. స్వతంత్రం వచ్చింది. చక్కగా చదువుకొనినవారు పరిపాలన, విద్యాబోధన, దేశ రక్షణ మొదలగు పనులలో పాల్గొనాలి. ఆనాడు మనకు కావలసినది స్వతంత్రం. ఈనాడు కావలసినది అభివృద్ధి. వ్యక్తి అభివృద్ధికి దేశం అభివృద్ధికీ మధ్య విరోధం లేదు. తమ ప్రతిభను పెంపొందించుకోవాలనే కోర్కె నేటి విద్యార్థులలో ఉంది. జాతికి అభివృద్ధి కల్గించాలనే కోర్కె కూడా వారిలో ఉంది.

అందుకు దోహదకరంగా విద్య అభ్యసించే అవకాశం అర్హులైన అందరు విద్యార్థులకు ఉండాలి. ఈనాడు పాఠశాలల సంఖ్య పెరిగింది. కళాశాలల సంఖ్య హెచ్చింది. అందువల్ల సీట్ల సంఖ్య వృద్ధి పొందింది, కానీ ఏం లాభం? సీట్లు దొరక్క అనేకమంది విద్యార్థులు బాధ పడుతున్నారు. ఈ పరిస్థితి 'పోవాలనేది మా విద్యార్థుల ప్రధమాశయం. అంతేకాదు, పాఠశాలలు కళాశాలలలో చేర్చుకొనబడిన విద్యార్థులకు వుత్తమమైన శిక్షణ లభించాలి. చిన్న చిన్న తరగతులు, సమర్థులైన వుపాధ్యాయులు, సకాలంలో తగినన్ని పాఠ్య పుస్తకాల సరఫరా మొదలగు సౌకర్యములు ఉండాలి భారతదేశము లాంటి పేద దేశములో మిక్కిలి ఖరీదయిన పాఠశాల 'భవనములు వసతి గృహములు నిర్మించుట సాధ్యము కాదు. అయితే నిరాడంబరములైనప్పటికీ ఆరోగ్యకరములైన పాఠశాల భవనముల నిర్మించుట అవసరము పాఠశాలలలో, కళాశాలలలో నేర్పే విద్యను మన దేశపు అవసరాలను దృష్టిలో ఉంచుకొని మార్చాలి.

ఇటు దేశానికి అటు విద్యార్థులకు కూడా శత్రువు నిరుద్యోగం. కాబట్టి దానిని నిర్మూలించాలి. అందుకొరకు విద్యావిధానంలో మార్పు తేవాలి. పరిశ్రమలు స్థాపించాలి. "అలనాటి రామభద్రునకు అరణ్యవాసం తప్పలేదు, ఈనాటి పట్టభద్రునకు నిరుద్యోగం తప్పలేదు." ఈ పరిస్థితి పోవాలి

"మీకు జాతి ఏమిచ్చిందన్నది కాదు ప్రశ్న మీరు జాతి కేమిచ్చారన్నది ముఖ్యము." అన్నాడు ఒకనాటి అమెరికా అధ్యక్షుడు "జాన్ కెన్నడీ". ఈ మాటతో ఈనాటి విద్యార్థిలోకం పూర్తిగా ఏకీభవిస్తోంది. అయితే దానిని ఆచరణలో పెట్టడానికి తగిన వాతావరణము మాత్రము లోపిస్తోంది.

ఎక్కడ చూసినా అసంతృప్తి, స్వార్థ కలహాలతో గూడిన ఈ సంఘంలో మా విద్యార్థి లోకానికి ఉన్నతాశయాలు అలవడ్డం కష్టం. ఆ కాలంలో వివేకానంద, గాంధీ, నేతాజీ వంటి నాయకుల ప్రబోధం విద్యార్థులకు లభించింది అటువంటి నాయకులు మరల పుట్టి విద్యార్థులకు వెలుగుబాటలు చూపాలి. అదే మా ప్రధానాశయం. ★

### రచయిత్రి పరిచయం



"పేరు : రాంపల్లి వైజయంతి.
జననము : 23–8–69.
తల్లిదండ్రులు : శ్రీయుత ఆర్. యస్. శర్మ, శ్రీమతి ఆర్. రాధ.

విద్యాభ్యాసం : హైదరాబాదు నారాయణగూడాలోని మాడపాటి హనుమంతరావు ఉన్నత పాఠశాల యందు "9"వ తరగతి.

అభిరుచులు : విద్యార్థినుల సాంస్కృతిక కలాపాలు, పుస్తకములు, పత్రికలు చదువుట, నూతన ప్రదేశములు చూచుట.

లోగడ కొన్ని బహుమతులు వచ్చినను పత్రికాముఖముగా బహుమానము పొందుట యిదే ప్రథమము. ఈ తొలి బహుమానము పూజ్య దేశోద్ధారకులు స్థాపించిన పత్రిక నుండి లభించుట నాకును, మా యింట్లో వారందరకును ఆనందమును కల్గించినది."

**— ఆర్. వైజయంతి**

---

గులాబీ రంగు చీరలో మెరిసిపోతున్న సుజాతని చూసి —

"ఏమిటే విశేషం?" అంది కళ్యాణి.

అసలే దిగులుగా వున్న సుజాత —

"ఏం లేదు" అని పని చూసుకోవడంలో మునిగిపోయింది.

చిరాగ్గా వున్న సుజాత ముఖాన్ని చూసి 'ఏం జరిగిందో?' అని అనుకుంది కళ్యాణి.

పన్నెండు గంటల సమయంలో కుమార్ సరాసరి సుజాత దగ్గరకొచ్చి —

## ఇది సంధ్యా సమయం

"హల్లో" అన్నాడు.

సుజాత తలెత్తలేదు.

"అబ్బా! ఈ చీరలో ఎంతందంగా వున్నారండీ."

అతని మాటలు వింటుంటే సుజాతకి ఎక్కడ లేని కోపం వచ్చింది.

తను ఇటువంటి పొగడ్తలు ఎవరినోట వినాలనుకుంది? చివరకు ఎవరి నోట వింటోంది!?

"మిస్ సుజాతా ..."

ఇంతలో కళ్యాణి వచ్చి — "సుజాతా! నిన్ను ఏజంటుగారు రమ్మంటున్నారు. వెళ్ళు" అని చెప్పింది.

సుజాత కళ్యాణివేపు చూసింది. కళ్యాణి కళ్ళతో చిన్నగా సంజ్ఞ చేసింది. దాన్ని అర్థం చేసుకున్న సుజాత లేచి లోపలకెళ్ళింది.

కుమార్ కళ్యాణివేపు కొరకొరా చూసి అక్కడ్నుంచి కదిలాడు.

**(ఇంకా వుంది)**

పెద్దకథ:

# ఇది సంధ్యాసమయం

— నందం రామారావు



(గత సంచిక తరువాయి)

లంచవర్లో కళ్యాణి అడిగింది :

"సుజాతా! ఏవిటి విశేషం ? కొత్త పెళ్ళి కూతుర్లా వున్నావ్ ?"

సుజాత, కళ్యాణివేపు చూసింది.

కళ్యాణికి తను ఇంతవరకూ శ్రీనివాస్ విషయం చెప్పలేదు! ఇప్పుడిప్పుడే చెప్పాలనిలేదు. శ్రీనివాస్‌తో తన పెళ్ళి కుదిరింతర్వాత ఒకేసారి శుభలేఖ అందించి కళ్యాణిని ఆశ్చర్యంలో ముంచాలి.

"ఏంలేదే. బీరువా తియ్యగానే ఈ చీర కన్పించింది. కట్టాలనుకున్నాను. కట్టాను. అంతే. అంతకుమించి విశేషం ఏంలేదు."

"సుజా! ఈ చీరలో ఎంత ముద్దొస్తున్నావో తెలుసా ? ఈ రోజు అందరి కళ్ళూ నీమీదే వున్నాయి. ఇక కుమార్ ఐతే..." కళ్యాణి మాట పూర్తికాకుండానే సుజాత అందుకుని —

"కళ్యాణీ! వాడి పేరు ఎత్తొద్దని చెప్పానా ? వాడూ, వాడి మాటలూ చూస్తుంటే కంపరం పుట్టుకొస్తుంది. వుద్యోగం చేస్తున్న ఆడపిల్లలంటే అందరికీ చులకనే. తమకేదో అధికారం వున్నట్టు ప్రవర్తిస్తారు" అంది సుజాత.

"అంతేకాదు సుజా! ఆడపిల్ల చేసే ప్రతి పనినీ వెయ్యి కళ్ళతో చూస్తుంటారు. ఇక వుద్యోగం చేసే ఆడపిల్ల వుందంటే ఆ పిల్లకి శీలం లేదన్న మాటే. ఎవరిదాకో ఎందుకు? మా వీధిలోని ఆడవాళ్ళందరూ కలిసి 'శీలం లేని పిల్ల'ని నాకేనాడో బిరుదిచ్చారు."

"కళ్యాణీ! మనలాటివారి కెప్పుడూ ఇటువంటి గొడవలు తప్పవనుకుంటాను. అవునూ! నిన్న సెలవు పెట్టావెందుకు ?"

ఆ మాటతో కళ్యాణి ముఖంలో నీలినీడలు వ్యాపించాయి!

"మరేంలేదు. నిన్న మా అక్క దగ్గర్నుంచి వుత్తరం వచ్చింది." అంది కళ్యాణి తలొంచుకుని టేబుల్‌మీద గోరుతో గీతలు గీస్తూ.

"మీ అక్క దగ్గర్నుంచా ?"

"అంటే, డైరెక్ట్‌గా అక్క దగ్గర్నుంచి కాదనుకో. నీకు తెలుసుగా మా అక్క సంసారం గురించి. ఇదివరకోసారి నాన్నగారు అక్కడి కెళ్ళినప్పుడు, మా అక్క ఇంటి ప్రక్కనున్నవారితో పరిచయం చేసుకుని, అక్కని గురించి ఎప్పటికప్పుడు తెలియజేయమని వారిని కోరారు. అందుకు వారు అంగీకరించారు. ఇప్పుడు ఆ ఇంటిప్రక్క ఆవిడే వుత్తరం వ్రాసింది."

"ఏమని ?"

"అక్కయ్య గర్భవతని. చాలా వీక్‌గా వుందని."

"అసలీ గొడవలన్నీ మీకు పెళ్ళితో వచ్చాయా?"

"అవునే. నాన్నగారు ఎంతో కష్టంమీద ఐదువేలు కట్నం ఇచ్చారు. పెళ్ళిలో బావ స్కూటర్ కావాలన్నాడు. కాకపోతే స్కూటరు కొనుక్కోవ డానికి నాలుగువేలు యిమ్మన్నాడు. అప్పటికే నిండా అప్పుల్లో మునిగిన నాన్న అప్పటికప్పుడు నాలుగువేలు ఎక్కడనుంచి తెస్తారు ! రెండు నెలల్లో ఆ డబ్బు ఇస్తామన్నారు. అప్పటికి పెళ్ళయింది. అక్కయ్య

కాపరానికిక్కూడా వెళ్ళింది. రెండునెలలు గడిచాయి. నాన్నగారు స్కూటర్‌కి డబ్బు ఇవ్వలేకపోయారు. అప్పటినుంచే అక్కయ్యకు కష్టాలు ప్రారంభమయ్యాయి. అత్తగారూ, భర్తా కలిసి అక్కయ్యని రాచి రంపానపెట్టసాగారు. డబ్బు ఇవ్వందే మమ్మల్ని ఆ గడప తొక్కొద్దన్నారు. అక్కయ్యని పంపడం మానేశారు. అక్కయ్య మాకు వుత్తరం రాసినా వూరుకునేవారుకాదు. ఈ గొడవల్లోనే అక్కయ్య ఆడపిల్లని కన్నది. అది చూసి వాళ్ళు మరీ రెచ్చిపోయి, మగపిల్లవాడిని కనలేదని అక్కయ్యను మరీ హింసంచడం మొదలుపెట్టారు. అక్కయ్యని పరీక్షించిన డాక్టర్ –'అక్కయ్య చాలా బలహీనంగా వుందనీ, ఈసారి గర్భవతి అయితే చాలా ప్రమాదమనీ, పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేస్తాననీ' చెప్పింది. కానీ, బావగారు వినలేదు. తనకు కొడుకు కావాలని పట్టుబట్టాడు. అక్కయ్య మళ్ళీ గర్భవతని నిన్న వుత్తరం వచ్చింది. అప్పటినుంచీ అక్కయ్యకు ఏమౌతుందోనని నాకు చాలాభయంగా వుంది.''

కళ్యాణి విచారంగా, చెప్తుంటే సుజాత ఆదోలా ఐపోయింది. తలెత్తి కళ్యాణికేసి చూసింది. కళ్యాణి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. ఆ కన్నీళ్ళు ఏ క్షణంలోనైనా శాపంగా పరిణమించేట్లుగావున్నాయి!

సుజాతకి కళ్యాణిని ఎలా ఓదార్చాలో తెలియక– ''విచారించకు కళ్యాణి'' అంది.

''విచారించీ ప్రయోజనం లేదని తెలుసుగా సుజా. కానీ, ఏం చెయ్యనే.''

''కళ్యాణి! ఈ దేశంలో ఆడపిల్ల జీవితం ఎంత అధ్వాన్నంగా తయారయిందే.''

''స్త్రీలు అభివృద్ధి సాధించారు. అందరూ ముందుకొస్తున్నారు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారూ అంటున్నారు. కానీ, అదంతా వట్టిదే. ఎవరో ఒక ఆడది మంత్రిణి అయినంతమాత్రాన, ఒకఆడది డాక్టరు అయినంతమాత్రాన స్త్రీలందరూ అభివృద్ధి సాధించినట్లేనా! ఒక్కొక్క ఇంటికెళ్ళి, అక్కడ ఆడవాళ్ళు ఎలా బ్రతుకుతున్నారో చూసి మాట్లాడాలి. మురికిగుంటల్లోని పురుగుల్లా ఎంత హీనంగా బ్రతుకుతున్నారో చూసి అప్పుడు చెప్పాలి. సుజా! అంతవరకూ ఎందుకూ మన విషయమే తీసుకో. మనం ఉద్యోగం చేస్తున్నాం కాబట్టి అందరూ మనల్ని గురించి గొప్పగా చెప్పకోవచ్చు. కానీ మనం ఎన్ని అవమానాలను ఎదుర్కొంటూ, ఎన్ని అవహేళనలను తట్టుకుంటున్నామో ఎవరికి తెలుసు!! ఆవేశంగా అంటున్న కళ్యాణి చేతిని తన చేతులోకి తీసుకుని –

''కళ్యాణి! ఎందుకే మనకిన్ని కష్టాలు?'' బేలగా అడిగింది సుజాత.

సుజాత అలా చిన్నపిల్లలా అడుగుతుంటే కళ్యాణికి అంతబాధలోనూ నవ్వొచ్చింది.

''ఎందుకేవిటే పిచ్చిపిల్లా. మనుష్యుల పైరూపాల్లో వచ్చినంత మార్పు వారి మనస్సుల్లో రాకపోవడంవల్ల.''

''మరి మన జీవితాలిక ఇంతేనంటావా?''

''ఆ. వాళ్ళ మనస్సుల్లో మార్పు రానంత వరకూ మనకీ కష్టాలు తప్పవు.'' అని వాచీ చూసుకుని – ''బాప్‌రే. టైమయింది. పద. పద'' అంటూ లేచింది కళ్యాణి.

కళ్యాణితోపాటు సుజాతకూడా లేచింది.

* * *

రోజులు గడుస్తున్నాయి.

శ్రీనివాస్‌ని చూడాలనే ఆరాటం రోజు రోజుకీ ఎక్కువ కాసాగింది సుజాతకి. ఈ ఆరాటంలో బ్యాంక్‌లో పనికూడా సరిగ్గా చేయలేకపోతోంది!

ఓ రోజు సుజాత ఇంటికొచ్చేసరికి, ఇంటి ముందు డాక్టర్‌గారి కారు ఆగివుంది.

ఆ కారుని చూడగానే సుజాత గబగబా నడిచి కారు దగ్గరకొచ్చింది. డ్రైవర్ కనిపించాడు.

''వచ్చింది కామేశ్వరరావుగారా?'' అనడిగింది సుజాత.

''కాదమ్మా. శ్రీనివాస్‌బాబుగారు!'' అన్నాడు డ్రైవర్.

సుజాత మనస్సు ఝల్లుమంది.

శ్రీనివాస్!

అబ్బా! ఎన్నాళ్ళకి అతన్ని చూడబోతోంది వుషారుగా అడుగులు వేసుకుంటూ లోపలకొచ్చింది

హాల్లో ఎవరూ కనిపించలేదు!

వంటింటి గుమ్మం దగ్గరకొచ్చి నిలబడ్డ సుజాతకు – దొడ్లో కనిపించిన దృశ్యాన్ని చూడగానే తల తిరిగినంత పనయింది!

జయ శ్రీనివాస్ చేతులమీద నీళ్ళు పోస్తోంది. శ్రీనివాస్, జయ ముఖంలోకి చూస్తూ నవ్వుతున్నాడు. జయకూడా తలొంచుకుని చిన్నగా నవ్వుతోంది!

సుజాత తెల్లబోయింది. తను చూసేది కలా నిజమా?

తలెత్తి మళ్ళీ చూసింది.

అవును! శ్రీనివాస్ నవ్వుతున్నాడు.

జయ కూడా నవ్వుతోంది!

సుజాత అక్కడ నిలబడలేక తన గదిలోకొచ్చి మంచంమీద పడుకుని కళ్ళు మూసుకుంది!

హాల్లోనుంచి శ్రీనివాస్ మాటలు వినిపిస్తున్నాయి.

సుజాతకి మనస్సు, శరీరం స్తంభించిపోయినట్లనిపించింది. మాటిమాటికీ ఆ దృశ్యమే కళ్ళముందు మెదుల్తోంది!

శ్రీనివాస్ అక్కయ్య ముఖంలోకి చూసి నవ్వుతున్నాడు. అక్కయ్య కూడా నవ్వుతోంది. వుహు, అంతేకాదు, సిగ్గుపడుతోంది. శ్రీనివాస్ నవ్వు కూడా మామూలుగా లేదు. ఆ నవ్వులో కొంటెతనం కనిపిస్తోంది!

శ్రీనివాస్ ఏమన్నాడో?

అక్కయ్య ఎందుకలా సిగ్గుపడుతోందో!

వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకుని వుంటారు?

వాళ్ళిద్దరిమధ్యా అంత చనువు ఎలా ఏర్పడింది?

శ్రీనివాస్ రోజూ వస్తున్నాడా?

ఆయనొచ్చే సమయంలో అక్కయ్య ఒక్కతే ఇంటి దగ్గర వుంటుంది. పిల్లలు బడికెడతారు. తనేమో బ్యాంక్ కెడుతుంది. ఎవరూలేని ఆ సమయంలోనే వారిద్దరికీ బాగా పరిచయం ఏర్పడి వుంటుంది!

ఆలోచనలతో సుజాత బుర్ర వేడెక్కిపోతోంది.

'శ్రీనివాస్ ఏదో సరదాగా మాట్లాడాడేమో'నని ఎంత సరిపెట్టుకుందామని చూసినా మనసు స్థిమిత పడడంలేదు! దుఃఖమో, కోపమో తెలియని భావం మనస్సుని నలిపేస్తోంది.

కళ్ళు మూసుకుని పడుకుంది.

''గీతా! సుజాతక్క ఇంకా రాలేదా?'' అడిగింది జయ.

''వచ్చిందక్కా. ఆ గదిలో పడుకుంది.''

''అలాగా. నేను చూడనేలేదే'' అంటూ గబగబా గదిలోకొచ్చి సుజాత దగ్గరకెళ్ళి –



"సుజా ! అలా పడుకున్నావే. ఎంతసేపయింది ఏవొచ్చి" అంటూ సుజాతమీద చేయి వేసింది.

సుజాత మాట్లాడలేదు.

జయ ఎంత బ్రతిమలాడినా సుజాత ఆ రాత్రి భోజనమే చెయ్యలేదు !

సుజాత విచారానికి కారణం తెలియక జయ మనస్సు విలవిల్లాడిపోయింది.

బహుశా, బ్యాంక్‌లో ఏదైనా గొడవ జరిగిందేమో. అటువంటిదేదైనా జరిగితే తనకు చెప్పొచ్చు గదా ! అని మథనపడసాగింది జయ !

* * *

సుజాత ఆ మర్నాడుకూడా ముభావంగానే వుంది. త్వరత్వరగా తయారయి ఇంట్లోంచి బయట పడింది. ఆ రోజు బస్సు త్వరగానే దొరికింది. బస్సులో కూర్చున్నాక నిన్నటి విషయం మళ్ళీ జ్ఞాపకం వచ్చింది !

కానీ, ఇప్పుడు రాత్రంత బాధగా లేదు !

తను పొరబాటుగా వూహించిందేమో ?

అందరిలా తనూ ఆలోచించింది.

ఒక ఆడా మగా మాట్లాడుకుంటే వాళ్ళిద్దరి మధ్యా ఏదో వున్నట్టుగానే వూహించి బాధపడింది.

'శ్రీనివాస్ తన కుటుంబంలోని అందరితోనూ కలుపుగోలుతనంగా వుంటాడు. అంత మాత్రాన అనుమానించడమేనా? ఛ ! తన చదువు, సంస్కారం ఏమయిపోయాయి ? తనెంతపొరబాటు చేసింది. పాపం ! అక్కయ్య రాత్రి తన ధోరణి చూసి ఎంత బాధపడిందో. సాయంత్రం ఇంటికెళ్ళగానే అక్కయ్యని క్షమాపణ అడగాలి.'

ఈ ఆలోచనలతో సుజాత మనస్సు చాలా తేలికయింది. తన భుజాలమీద నుంచి ఒక పెద్ద

## ఇది సంధ్యా సమయం

బరువును దింపినట్టుగా ఫీలయింది !

ఆ సాయంత్రం బ్యాంక్‌లో పనిపూర్తి కాగానే అక్కయ్యకి పువ్వులు, పిల్లలకు స్వీట్స్ తీసుకొని ఇంటికొచ్చింది. గుమ్మంలో అడుగుపెట్టగానే కనిపించిన దృశ్యాన్ని చూసి సుజాత స్థంభించి పోయింది !

ఏ విషయాన్నైతే తేలిగ్గా తీసుకుని మరచి పోవడానికి ప్రయత్నించి, సంతోషంగా ఇంటి కొచ్చిందో మళ్ళా అదే సంఘటన చూస్తోంది !

హాల్లో జయా, శ్రీనివాస్ ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు. శ్రీనివాస్ ఏదో అంటున్నాడు. జయ పకపకా నవ్వుతోంది.

అది చూడగానే సుజాత మనస్సు భగ్గుమంది సిగ్గులేకుండా ఎలా నవ్వుతున్నారో. రోగిష్టిదాన్ని ఒకమూల పడేసి హాయిగా ప్రేమకలాపాలు సాగిస్తున్నారు !

వెనక్కి తిరిగి వెళ్ళిపోవాలనుకుంది సుజాత. కానీ, ఇంతలో జయ — "సుజా! అక్కడే ఆగి పోయావేమిటే ? రా" అంది కూర్చీలోంచి లేస్తూ.

సుజాత తప్పనిసరిగా లోపలకు అడుగుపెట్టింది.

"ఏవండీ ! బావున్నారా ?" శ్రీనివాస్ పలుకరించాడు.

సుజాత తలెత్తి శ్రీనివాస్ కేసి చూడాలను కుంది. ఆ చూడడంలో తన ముఖం ఎలా వుంటుందో తనకు తెలుసు. అందుకే తలొంచుకుని—

"వూ" అని లోపలకు వెళ్ళిపోయింది.

"వస్తానండి" అని చెప్పి శ్రీనివాస్ వెళ్ళి పోయాడు.

జయ వంటింట్లోకెళ్ళింది

ఐదు నిముషాలు గడిచాక సుజాత లేచి కాఫీ త్రాగుదామని వంటింట్లోకొచ్చి, ఫ్లాస్కులోని కాఫీని గ్లాసులోకి వంపుకోబోతుండగా —

"సుజాతా ! ముందీ టిఫిన్ తినవే" అంటూ జయ ప్లేటులో బజ్జీలు పెట్టసాగింది ప్లేటులో పెడుతూనే —

"డాక్టర్‌గారికి టిఫిన్ పెడదాంగదాని చేశాను ప్ప ! తీరా, ఆయన వచ్చాక పెట్టడమే మర్చి పోయాను." స్వగతంగా అనుకోసాగింది

ఆ మాట వినగానే సుజాత ఒళ్ళు మండి పోయింది బజ్జీల ప్లేటు తీసుకోబోయేదల్లా చెయ్యి వెనక్కుతీసుకుని కాఫీ కూడా త్రాగకుండా అక్కడ నుంచి వెళ్ళిపోవాలనుకుంది. కానీ, తల బ్రద్దలవు తోంది. కాఫీ త్రాగక తప్పదు అందుకనే కాఫీ గ్లాసు తీసుకుంది

"అదేవిటే ? టిఫిన్ తినవా ?"

"అక్కర్లేదు. ఎవరికోసం చేశావో వారికే పెట్టు" అని విసురుగా అక్కడనుంచి వెళ్ళిపోయింది సుజాత.

సుజాత ప్రవర్తన అర్థంగాక జయ తెల్లబోయింది. ఎందుకంత కోపంగా వుంది ?

నిన్నకూడా అలాగే వుంది ?

బ్యాంక్‌లో ఏదైనా గొడవ జరిగిందేమోనని సరిపెట్టుకుంది.


కానీ, ఈ రోజుకూడా అలాగే కోపంగా వుంది


ఏం జరిగింది ?

ఏదో జరిగివుంటుంది !

ఏ చిన్న విషయం జరిగినా సుజాత తనకు చెబుతుంది. మరి, ఈసారెందుకు చెప్పలేదు ?




ఎంత ఆలోచించినా సుజాత ప్రవర్తనకి కారణం తెలియక జయ తల్లడిల్లిపోయింది !

* * *

''మేడమ్ ! దయచేసి మరేమనుకోక ఈ చెక్ కొంచెం క్యాష్ చేసిపెడతారా ?''

కళ్యాణి తలెత్తి చూసింది. ఎదురుగా ముప్ఫై ఏళ్ళ యువకుడు సాదా బట్టల్లో స్మార్ట్‌గావున్నాడు. చాలా సేపటినుంచీ నిలబడేవున్నాడు.

కళ్యాణి మాట్లాడకపోవడం చూసి, ''అర్జెంటుగా ట్రెయిన్ కెళ్ళాలండి అందుకని అడిగాను. మిమ్మల్ని డిస్టర్బ్ చేసినట్లున్నాను సారీ'' అని అవతలకు వెళ్ళబోయాడు.

కళ్యాణి సీటులోంచి లేచి – ''అబ్బే ! లేదండీ ఇటివ్వండి మీ చెక్'' అని తీసుకుంది

క్యాష్ కౌంటర్ దగ్గర విపరీతమైన రష్‌గా వుంది. క్యాషియర్ రంగనాథం తెలిసినవాడవడం వలన, ఐదు నిముషాల్లో పనిచేయించి, డబ్బు తీసుకొచ్చి అతనికిచ్చింది కళ్యాణి ఆ వ్యక్తి ఎంతో సంతోషపడి – ''మెనీ. మెనీ థాంక్సండి'' అని చెప్పి వెళ్ళిపోయాడు.

కళ్యాణి సీట్లోకెళ్ళి పని చేసుకోబోతుంటే, పోస్ట్‌మాన్‌వచ్చి కళ్యాణికి లెటర్ ఇచ్చి వెళ్ళాడు

కళ్యాణి ఆ లెటర్ విప్పి చూసింది.

అది పార్వతి వ్రాసింది.

'మీ అక్కయ్యకు వంట్లో బావుండలేదు. ఐనా, మీ బావ, అత్తగారూ మీ అక్కయ్యను సాధించడం మానలేదు. లోగడ మీకో ఉత్తరం వ్రాశాను. వీలైనంత త్వరలో వచ్చి ఆవిడను ఈ నరకం నుంచి తప్పించండి. ఆవిడ బాధ మేము చూడలేకుండా వున్నాం.'

పార్వతి.

ఆ ఉత్తరం చదవగానే కళ్యాణి గుండెల్లో విచారం గూడు కట్టుకుంది. ముఖాన్ని కర్చీఫ్‌తో తుడుచుకుని వుత్తరం మడచి బ్యాగ్‌లో పెట్టుకుంది.

'ఆవిడను ఈ నరకంనుంచి తప్పించండి.'

'ఏం చెయ్యాలి ?'

ఏం చెయ్యాలన్నా ప్రస్తుతం డబ్బు కావాలి.

డబ్బు సంపాదించాలంటే ఇక ఒకే ఒక్క మార్గం వుంది.

ఆనాడు అమ్మ కోసం డబ్బు సంపాదించిన మార్గమే !

''కళ్యాణీ ! ఇంకా అలా కూర్చున్నావేమే. లంచ్ టైమయింది.'' సుజాత మాటతో వులిక్కి పడింది కళ్యాణి. పుస్తకాలు సర్ది సుజాత వెంట వెళ్ళింది.

ఇద్దరూ రూమ్‌లో కూర్చున్నారు.

''అదేంటే అలా వున్నావ్ ?'' అనడిగింది సుజాత టిఫిన్‌బాక్స్ ఓపెన్‌చేస్తూ.

''పార్వతి వుత్తరం వ్రాసింది.''

''పార్వతా ! ఏమని వ్రాసింది ?''

కళ్యాణి బ్యాగ్‌లోంచి వుత్తరం తీసిచ్చింది.

సుజాత ఆ వుత్తరాన్ని తీసుకుని చదివి –

''ఇప్పుడేం చేస్తావ్ కళ్యాణి ?'' అని అడిగింది

''ముందు డబ్బు తీసుకెళ్ళి వాడి ముఖాన, అదే మా బావనేవాడి ముఖాన కొడతాను అక్కయ్య కోసమని అతికష్టంమీద ఐదొందలు దాయగలిగాను ''

''ఆ డబ్బు సరిపోతుందా ?''

''చాలదు.''

''మరేం చేస్తావ్ ?''

''మా అమ్మ కోసం డబ్బు సంపాదించిన మార్గమే'' రెండు చేతుల మధ్యా ముఖం ఆన్చుకుని అంది కళ్యాణి.

సుజాత అదిరిపడి – ''కళ్యాణి !'' అంది

కళ్యాణి తలెత్తి, నవ్వేలేక నవ్వి – ''అవునే ! అంతకంటే వుపాయం లేదు'' అంది.

''కళ్యాణి ! నీకేవన్నా మతిపోయిందా ? వాటి వలన నువ్వెంత అల్లరి పడ్డావో అప్పుడే మరచి పోయావా ?''

''సుజా ! ఎలాగూ అల్లరి పడ్డానుగదా ఇప్పుడింక క్రొత్తగావచ్చే అప్రదిష్ట ఏముంటుంది? కనీసం ఈ రకంగానైనా అక్కయ్య జీవితం బాగు పడుతుంది సుజాతా ! జీవితంలో అన్ని విధాలా ఓడిపోయిన ఆడపిల్లనే నా కంటూ ఇప్పుడు ఏ కోరికాలేదు ఈ కుటుంబం కోసం ఎన్నిరకాలుగా అప్పు చెయ్యాలో, ఎన్నిరకాలుగా 'లోన్లు' పెట్టాలో పెట్టి డబ్బు తీసుకున్నాను ఐనా, సమస్యలు తీరలేదు. తీరవుకూడానూ తీరుతాయనే ఆశతో బ్రతుకుతున్నాను ఆ ఆశే లేకపోతే . .'' కళ్యాణి ఆ పైన మాట్లాడలేకపోయింది కంఠం దుఃఖంతో పూడుకుపోయి మాట పెగల్లేదు

''కళ్యాణి !'' అంది సుజాత

కళ్యాణి నవ్వి - ''సుజా ! మన రాతలు బావుండలేదని కష్టాలు రాకుండా మానవు కదా ? ఇవన్నీ ఎందుగ్గానీ ముందు టిఫిన్ చేద్దాం'' అంటూ బాక్స్ తీసింది.

సుజాతకు టిఫిన్ సహించలేదు తన జీవితం, కళ్యాణి జీవితం ఒక్కలానే వుంది !

తన మనస్సులో బాధను కళ్యాణికి చెప్పుకోవా లన్పించింది ఇప్పుడు చెప్పి కళ్యాణికి ఇప్పుడున్న కష్టాలకు తోడు మరికొంత బాధని కలిగించడమే అవుతుంది !

సుజాత మనస్సులో శ్రీనివాస్ మెదిలాడు. అతడిపైన తను పెంచుకున్న ఆశలు, కోర్కెలూ జ్ఞాపకం వచ్చి గుండెల్లో ఆవేదన బయలుదేరింది

'శ్రీనివాస్ ! నా దగ్గరకొచ్చినట్లే వచ్చి ఎందుకలా దూరంగా వెళ్ళిపోయావ్ ? నిన్ను ప్రేమించి ఆరాధించినందుకా నాకీ శిక్ష ? నాకన్నా అక్కయ్యలో నిన్ను ఆకర్షించింది ఏవిటి ?'

''సుజాతా ! అతిగా ఆలోచించడం ఆరోగ్యానికి మంచిదికాదు పద వెడదాం'' అంది కళ్యాణి

సుజాత లేచింది.

## ఎలక్ట్రానిక్ చెవి !

బధిరత్వాన్ని తొలగించేందుకు పశ్చిమ జర్మనీ డాక్టర్లు క్రొత్తరకం ఆపరేషను చికిత్సను రూపొందించారు ఈ చికిత్సలో మధ్య చెవిలో ఎలక్ట్రోడులను అమర్చి, శబ్దాన్ని మెదడుకు తీసుకునిపోయే నరాలతో కలుపుతారు. ఒక మైక్రోఫోను ఈ ఎలక్ట్రోడులకు శబ్ద తరంగాలను ప్రసారం చేస్తుంటాయి. ఈ చికిత్సలో లోపలి చెవిని తెరవడం జరగదు. ఆపరేషన్ల తర్వాత చెవిటి వారు వాతావరణంలో ఏర్పడే శబ్దాలను సులభంగా వినగలరు. పెదవుల కదలికను గుర్తించడం ద్వారా సంభాషణల్లో 95 శాతాన్ని అర్థం చేసుకోగలరు. అయితే దీని కోసం కొంత శిక్షణ ఇవ్వవలసి ఉంటుంది పశ్చిమ జర్మనీలో పదివేల మంది చెవిటి వారున్నారు. ఈ ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో జరిగే జాప్యం వలన నెలకొకరికి మాత్రమే ఆపరేషను చేయడానికి వీలవు తుంది.

ఇద్దరూ బయటకొచ్చారు.

సుజాతకి అసహనం రోజురోజుకీ పెరిగిపోసాగింది.

మనుషులందరూ స్వార్థపరులే.

అందరూ వంచకులే.

ప్రేమాభిమానాలూ, మమతానురాగాలు లేవు!

ఈ మనుష్యులందర్నీ వదలి ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోవాలి.

అందరిమీదా ఏదో కసి, ద్వేషం. కనిపించిన వాళ్ళనల్లా హత్య చెయ్యాలన్నంత ఆవేశం.

ఎవరన్నా నవ్వుతూ, వుత్సాహంగా వుంటే భరించలేని ఆవేదన!

జయ, గీత, రవి, సుజాత కోపానికి తరచుగా గురవుతున్నారు.

ముఖ్యంగా జయ 'నీడ' భరించలేకుండావుంది సుజాత!

జయ అక్కకాదు

తన సౌభాగ్యాన్ని, ఆనందాన్ని దోచుకున్న రాక్షసి.

శ్రీనివాస్ తనవేపు కన్నెత్తికూడా చూడడం లేదు. అక్క అతన్ని మాయచేసి బుట్టలోవేసుకుంది.

అక్కయ్య నవ్వుతుంటే అసహ్యమేస్తోంది. ఆ నవ్వు చూసి తను సహించలేకపోతోంది.

అక్కయ్య నవ్వకూడదు.

ఎప్పుడూ ఏడుస్తూనే వుండాలి.

అప్పుడే తన మనస్సు శాంతిస్తుంది!

అందుకే — జయని సాధ్యమైనంతవరకూ హింసించడం మొదలుపెట్టింది సుజాత.

అన్నం కాస్త బిరుసయితే చాలు — "ఇలా మేకుల్లా వండితే తినాలనా, చావాలనా! కష్టపడి సంపాదిస్తున్నా కడుపునిండా తినే యోగ్యతలేదు" అంటూ కంచంలో చెయ్యి కడిగేసేది.

మరోసారి —

"అలసి అలసి వస్తాను గదా. నీళ్ళలాటి కాఫీ మొహంమ్మీద పొయ్యకపోతే ఏదైనా టిఫిన్ చెయ్యకూడదా? ఛీ! ఛీ! వెధవకొంప" అంటూ విసుక్కునేది.

రవి పరీక్ష ఫీజు అడిగాడని ఓరోజు వాడ్ని బాదేసింది.

"మిమ్మల్నందర్నీ పోషించాల్సిన అవసరం నాకేంలేదురా ఒక్క సుఖం లేదు. ఆనందం లేదు. జీవితమంతా మీకు సంపాదించి పెట్టడమే సరిపోతోంది" అంటూ అరిచింది.

ఓ రోజు మధ్యాహ్నం కమలమ్మ అడిగింది — "ప్రొద్దున్న ఏవిటే ఆ గోల" అని.

ఇంట్లో జరిగే గొడవలు తల్లికి తెలియడం ఇష్టంలేదు జయకి.

ఆవిడకసలే ఆరోగ్యం బాగాలేదు. ఇవన్నీ తెలిస్తే ఆవిడ ఏమవుతుందో?

"ఏంలేదమ్మా" అని సర్దేసింది జయ.

"ఎలాగైనా సుజాతకి కోపం, విసుగూ ఎక్కువయ్యాయే. ఏనా, దాంతప్పేం వుందిలే. సుఖంగా వుండవలసిన వయస్సులో బాధ్యతలు నెత్తిమీదకొచ్చి పడ్డాయ్ ఇదంతా నా రాత." అంది కమలమ్మ కళ్ళొత్తుకుంటూ.

## ఇది సంధ్యా సమయం

సుజాతని గురించి పూర్తిగా తల్లికి అర్థమయినట్లు గ్రహించింది జయ.

'సుజాత వయసు ఆడపిల్లలు హాయిగాకాలేజీల్లో చదువుకుంటున్నారు. లేదా, పెళ్ళిళ్ళు చేసుకుని హాయిగా కాపరాలు చేస్తున్నారు. కానీ, సుజాత కుటుంబం కోసం కష్టపడుతోంది. ఏ వయసులో జరగవలసిన ముచ్చట ఆ వయసులో జరక్కపోతే ఇంతే!

సుజాతకి గుదిబండలా తనొకటి. కోరికలు తీర్చుకోవాల్సిన ఈ వయసులో బరువు బాధ్యతలు నెత్తిమీద వేసుకోవాలంటే ఎవరికైనా బాధగానే వుంటుంది. అందునా, ఇవి ఇప్పుడిప్పుడే తీరే బాధ్యతలు కావు! ఏ సరదా తీర్చుకోవాలన్నా ఇంటి ఖర్చులు తప్పడం లేదు!'

ఆలోచిస్తున్న కొద్దీ జయకి సుజాత మీద విపరీతమైన జాలి కలగసాగింది.

ఇన్నాళ్ళూ తనీ విషయమే గుర్తించలేదు సుజాత డబ్బిస్తే వండిపెడుతోంది. అంతేగానీ, సుజాతకి సహాయం చేద్దామనే ఆలోచనే రాలేదు!

మధ్యాహ్నం సమయమంతా తనకు ఖాళీయే. ఆ సమయంలో వూరికే కూర్చోకుండా ఏదైనా పనిచేసి నాలుగు డబ్బులు సంపాదించాలి.

ఏం చెయ్యాలి?

జయ ఆ రోజు అంతా ఆలోచించింది.

ఏ ఉపాయం తోచలేదు.

తనకీ విషయంలో సలహా చెప్పగలిగేది ఒక్క శారదమ్మగారే!

* * *

కళ్యాణి మందులషాపులో మందులు కొనుక్కుని బయటకొచ్చి హ్యాండ్‌బ్యాగ్‌లో చిల్లరా, చీటీ వేసుకుంటోంది.

ఇంతలో ఎవరో కుర్రాడు కళ్యాణి చేతిలోంచి పర్సు లాక్కుని పరిగెట్టాడు.

కళ్యాణి కంగారుపడుతూ —

"దొంగ...దొంగ..."అని గట్టిగాఅరవసాగింది

కళ్యాణి అరుపు విని ఎవరో వ్యక్తి పరిగెట్టుకు వెళ్ళి ఆ కుర్రాడిని పట్టుకుని పర్సు తీసుకొచ్చి కళ్యాణి కిస్తూ — "ఇదిగోనండి మీ పర్స్. అన్నీ సరిగ్గా వున్నాయో, లేదో చూసుకోండి" అన్నాడు ఆయాసపడ్తూ.

కళ్యాణి ఆయనవేపు తిరిగి 'థాంక్సండీ' అని అనబోయి, 'ఈయన్నెక్కడో చూశానే' అని అనుకుంది.

అతనూ అదే స్థితిలో వున్నాడు. అతనే ముందు అడిగాడు — "మీరు బ్యాంక్‌లో పని చేస్తున్నారు కదూ?"

కళ్యాణికి అప్పుడు జ్ఞాపకం వచ్చింది.

అవును! అతను ఒకసారి వచ్చి అర్జెంటుగా చెక్ క్యాష్ చెయ్యాలని కోరితే తను చేసిచ్చింది ఇప్పుడు బదులుకి బదులు తీరిపోయింది!

కళ్యాణి నవ్వుకుంది.

"అదేవిటండీ నవ్వుతున్నారు? నేనెవరో గుర్తుకొచ్చానా?"

"ఆ."



కలకత్తా ఆంధ్ర సంఘంవారు ఇటీవల జరిపిన ఆదికవి నన్నయ జయంతి సభలో వేదికపై సభాధ్యక్షులు డాక్టర్ ప్రభాకర్ మాచ్వే, ముఖ్య అతిథి, వక్త డాక్టర్ దాశరథి, సంఘం అధ్యక్షుడు శ్రీ జె. ఆర్ కె మూర్తిగార్లని చిత్రంలో చూడవచ్చు

"ఆ రోజు మీరు సహాయం చెయ్యబట్టే వెంటనే నేను ట్రెయిన్‌కి అందుకోగలిగాను. నాన్నగారిని ఆఖరిసారిగా చూసుకోగలిగాను" అన్నాడు బాధగా

"అయ్యో! మీ ఫాదర్ పోయారా?"

"అవునండి!"

ఇద్దరూ మాట్లాడుకుంటూ నడవసాగారు

"నా పేరు శివరావండి. ఓ ప్రైవేట్ కంపెనీలో క్లర్క్‌గా పనిచేస్తున్నాను. అమ్మ, చెల్లి మా వూళ్ళోనే వున్నారు. మంచి ఇల్లు చూసి వాళ్ళను తీసుకురావాలి. మీ ఎరికలో ఏదైనా ఇల్లుంటే చెప్పండి."

"అలాగే!"

క్షణం ఆగి శివరావు అన్నాడు — "ఇంతవరకూ మీ గురించి చెప్పారు కాదు?"

"నాకు బ్యాంక్‌లో వుద్యోగమనే విషయం మీకు తెలుసుగదా!" అని నవ్వింది కళ్యాణి

"మీ ఫాదర్ .."

శివరావు మాట పూర్తికాకమునుపే కళ్యాణి అంది — "ప్రస్తుతం మా నాన్నగారు రిటైర్డై ట్యూషన్లు చెబుతున్నారు. అన్నయ్య వుద్యోగ ప్రయత్నంలో వున్నాడు. ఇద్దరు తమ్ముళ్ళు చదువుకుంటున్నారు."

శివరావు నవ్వాడు. —"మీరేం అనుకోనంటే మనం పరిచయమైన ఈ శుభసందర్భంలో ఒక కప్పు కాఫీ తాగుదాం. వస్తారా!" "ఇద్దరం ఒక కప్పేనా?" అని కళ్యాణి అనబోయి, అతిచనువు చూపించినట్లవుతుందని మానేసింది.

ఇద్దరూ హోటల్లో కూర్చున్నారు. "ఇందాక చూశారా? ఆ కుర్రాడికి పదేళ్ళుంటాయో లేదో? చేతిలోవున్న పర్సును ఎంతో నేర్పుగా కొట్టేశాడు. వాడి ధైర్యం తలచుకుంటే చాలా ఆశ్చర్యంగా వుంది." అంది కళ్యాణి.

"అదంతా ఆకలి మహత్యమండీ ఆకలి మనుషులచేత ఎటువంటి పనినైనా చేయిస్తుంది.

విద్యార్థి లోకం వ్యాస రచన పోటీలో ప్రత్యేక బహుమతి రు. 150/-లు పొందిన వ్యాసం


# మా విద్యార్థిలోకం ఆశయాలు

"నేటి బాలలే రేపటి పౌరులు" అన్నట్లుగా నేటి మా విద్యార్థులు రేపటి భారతదేశ నిర్మాతలు. ఎన్నో ఆశలతో, మరి ఎన్నో ఆశయాలతో, విద్యార్థులు చదువుకోసం స్కూళ్ళకు, కాలేజీలకు వెళుతున్నారు. పై చదువుల ద్వారా తమ భవిష్యత్తును, తద్వారా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దవలెననే కోరిక ప్రతి విద్యార్థిలోను ఉంటుంది.

అలా కలలు కనే మా విద్యార్థిలోకం నేటి విద్యా విధానంతోను, పరీక్షల పద్ధతులతోను, రాజకీయ నాయకుల కుతంత్ర పోరాటాలతోను, జోక్యంతోను విద్యార్థులు నిరాశ చెంది నిస్పృహకు లోనవుతున్నారు. అంతేకాక సరిపడు టీచర్లు లేక, ఒకవేళ టీచర్లు ఉన్నా సరియైన పాఠ్య పుస్తకములు లేక పాఠాలు చెప్పాలనే ఆసక్తి వారిలో లోపించుచున్నది లోపభూయిష్టమైన పరీక్ష పద్ధతుల వలన విద్యార్థులు కూడా చదువుల పట్ల చూపించవలసిన ఆసక్తిని చూపించుటలేదు. దీనివలన చదువులంటే శ్రద్ధ తగ్గి ఇతర అనవసర విషయాలలో జోక్యం చేసుకోవటం వలన వారి ఆశయములు నెరవేర దానికి ఆటంకమౌతున్నది.

తమ ఆశలు ఫలించాలంటే విద్యార్థులే పూనుకొని తమ సమస్యలకు తగిన పరిష్కార మార్గాలను కనుగొనవలెను. దీనికై విద్యార్థులు సంఘీభావంతో కలిసి కట్టుగా పరిష్కారమార్గము లను అమలు జరపాలి. చదువుకు ఆటంకము లేనట్లుగా ప్రతి చిన్న సమస్యకు సమ్మెలు చేయ కుండా సంప్రదింపులద్వారా సమస్యలు పరిష్కారము చేయవలెను. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల అభివృద్ధిలో తమ పాత్రను తెలుసుకొని తదను గుణముగా పాఠములు బోధించవలెను. ప్రభుత్వము మరియు రాజకీయ నాయకులు విద్యార్థులను పావులుగా ఉపయోగించడం మాని, ఉన్నత విద్యా ప్రమాణముల అమలుకు కృషిచేయాలి. అంతేగాక సరియైన పాఠ్య పుస్తకములు సకాలములో అందే ఏర్పాటు చేయాలి. విద్యార్థు లందరు తమ ఆశయ సాధన కోసం విద్యార్థి దశనుండీ పునాదులు వేసుకొని కృషి చేయాలి. యువక రక్తపు వేడిలో సమస్యలను క్లిష్టము చేయకుండా, శాంతి సామరస్యాలతో వాటి పరిష్కారానికి కృషిచేసి మంచి విద్యార్థులు అనిపించుకోవాలి. తల్లితండ్రులు కూడా పిల్లల యెడ తమ బాధ్యతలు గుర్తించి వారి ఆశయ సాధనకు సరియైన మార్గాన్ని చూపించి కృతార్థులయ్యేలా చూడాలి. ★

## రచయిత పరిచయం



"1968వ సం.లో పుట్టాను. స్థానిక సి. ఎస్. ఐ. హైస్కూల్‌లో 10వ తరగతి చదువుచున్నాను. క్రికెట్ ఆడటం, సైక్లింగ్, వ్యాయామము చేయటం అంటే నాకు ఇష్టం. చిత్రలేఖనము, పుస్తక పఠనం చేస్తుంటాను. వ్యాసరచన పోటీలో నా వ్యాసానికి ప్రత్యేక బహుమతిని ఇచ్చిన ఆంధ్ర సచిత్ర వార పత్రిక సంపాదకులకు నా కృతజ్ఞతలు."

— జి. శ్రీనివాసరావు

పాపం, సన్నగా వూపిరిలేనట్టున్నాడు. వాడిని పోలీసులకు పట్టిస్తామంటారు జనం. వాడు ఆ పోలీసుల చేతుల్లో పడితే ఆ కాస్త ప్రాణం గుటుక్కు మంటుంది అందుకే ఒక రూపాయి వాడి చేతిలో పెట్టి, తిరిగి ఇటువంటి పనులు చెయ్యకు దెబ్బలు తింటావని చెప్పి పంపాను."

కళ్యాణి శివరావు వేపు ఆశ్చర్యంగా చూసింది. "కానీ, కళ్యాణిగారూ! వాడు మళ్ళీ దొంగతనం చెయ్యడన్న గ్యారంటీ ఏమీ లేదనుకోండి. నేనిచ్చిన రూపాయి అయిపోగానే మళ్ళీ దొంగతనం చేస్తాడు దానికి మనమేం చెయ్యలేంగదా!" అని శివరావు నిట్టూర్చాడు

## ఇది సంధ్యా సమయం

ఇంతలో కాఫీ వచ్చింది.

ఇద్దరూ త్రాగారు.

"మన జీవితాలు మాత్రం ఏం బావున్నాయి లేండి వాడు తిండి లేకపోతే దొంగతనం చేస్తున్నాడు. మనం అది చెయ్యలేక కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకుంటున్నాం. ఆకలితోపాటు మన కనేక సమస్యలు. చిక్కులు. జవాబుదొరకని పజిల్స్"

శివరావు మాటలు వింటుంటే కళ్యాణికి తన అక్క సీత జ్ఞాపకం వచ్చింది.

అవును! అతను చెప్పింది నిజమే!

"మన సమస్యలన్నిటికీ ఒక్కటే మందండి అది డబ్బు" అంది కళ్యాణి.

"అవునండి. కాని, అది మనకు దొరకని మందు" అంటూ శివరావు లేచాడు

అవును! ఆ మందూ దొరకదు

తను జబ్బూ నయంకాదు! అని అనుకుంటూ కళ్యాణి కూడా బ్యాగ్ తీసుకుని అతన్ని అనుసరించింది.

ఇద్దరూ బయట కొచ్చింతర్వాత—

"నమస్తే. వస్తానండి" అంది కళ్యాణి

"నేనూ వెడతానండి" అన్నాడు శివరావు నవ్వుతూ.

అతని మాటకి కళ్యాణి నవ్వింది

ఆ నవ్వుకి లైటు వెలుగులో కళ్యాణి ముఖం తళుక్కుమంది.

'కళ్యాణిలోని అందమంతా ఆమె నవ్వులోనే వుంది' అని అనుకున్నాడు శివరావు

కళ్యాణి రిక్షా ఎక్కింది.

ఆ రిక్షా కనుమరుగయ్యే వరకూ అలాగే చూస్తుండిపోయాడు శివరావు!

* * *

సాయంత్రం అయిదున్నరవుతోంది.

సుజాత బస్సుకోసం వెయిట్ చేస్తూ బస్‌స్టాపులో నిలబడింది.

"హల్లో సుజాతా!"

సుజాత తలత్రిప్పి చూసింది ఎదురుగా స్కూటర్‌మీద కుమార్.

సుజాతని చూసి నవ్వుతూ — "వస్తారా? లిఫ్టు యిస్తాను" అన్నాడు.

సుజాత కుమార్‌వేపు చూసింది. ఆ క్షణంలో సుజాతకి కుమారంటే ఎప్పటిలా అసహ్యం కలగలేదు జాలి కలిగింది. సానుభూతి కలిగింది. తనెంత విదిలించినా తనవెంటే పడుతున్నాడు. తనని అంతగా అభిమానిస్తున్నాడా!

సుజాత తనని ఏమైనా అంటుందేమోనని బెదురుగా చూడసాగాడు కుమార్. కాని, సుజాత మౌనం అతనికి వుత్సాహాన్నిచ్చింది.

"మీలాటి బ్యూటీ క్వీన్ ఇలా బస్సుస్టాపులో నలుగురి మధ్యా నిలబడ్డం ఏం బాగాలేదండి ప్లీజ్ రండి లిఫ్టు యిస్తాను" అని అభ్యర్థించాడు కుమార్.

సుజాత వెంటనే ఇంకేం ఆలోచించకుండా వెళ్ళి కుమార్ వెనుక స్కూటర్‌పై కూర్చుంది.

అది చూసిన కుమార్ మహానందపడి పోయాడు. హుషారుగా స్కూటర్ స్టార్ట్ చేశాడు ఒక హోటల్ ముందు స్కూటర్ని ఆపి —

"సుజాతా! మీరు బాగా అలిసిపోయినట్లున్నారు. 'టీ' త్రాగి రిలాక్స్ అవుదురుగాని రండి" అన్నాడు.

సుజాత కాదనకుండా కుమార్ను అనుసరించింది.

తను కోరిందే తడవుగా సుజాత తన వెంట రావడం కుమార్ ఆశ్చర్యపోయాడు.

(ఇంకా ఉంది)




(గత సంచిక తరువాయి)

మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో తన దగ్గర కొచ్చిన శివరావుని చూసి ఆశ్చర్యపోయింది కళ్యాణి

శివరావు ముఖమంతా పీక్కుపోయివుంది బట్టలు మాసిపోయాయి ఎన్నాళ్ళనుంచో జబ్బుపడ్డ వ్యక్తిలా వున్నాడు

"అరే! అదేవిటలా వున్నారు? ఒంట్లో బాగాలేదా? ఈమధ్య కన్పించకపోతే ఏవిటో అనుకున్నాను మీకేం జరిగింది శివరావుగారూ?"

శివరావు నవ్వలేక నవ్వాడు

"కళ్యాణి! అంతా చెప్తాను దయచేసి ఈ పూట శెలవు పెట్టి మీరు నా రూమ్‌కి రాగలరా?"

కళ్యాణి ఆశ్చర్యపోయి —

"మీ గదికా?" అన్నది

"ప్లీజ్! దయచేసి రండి — నామీద ఆమాత్రం నమ్మకం లేదా?"

"ఛ! ఛ! అదేంలేదు వస్తాను" అని శెలవు చీటీ వ్రాసి ఏజంటుగారికిచ్చి, బ్యాగ్ తీసుకుని శివరావు వెంట బయటకొచ్చింది కళ్యాణి

ఎండ చుర్రుమంటోంది

"ఆటోలో వెడదాం" అని ఆమె జవాబు కోసం ఎదురు చూడకుండానే ఆటో పిలిచి అందులో ఎక్కాడు శివరావు కళ్యాణి కూడా ఎక్కింది

ఆటో పదినిముషాల్లో ఒక పెంకుటింటిముందు ఆగింది

"కళ్యాణి! దిగండి ఇదే మా భవంతి" అన్నాడు శివరావు ఆటోతనికి డబ్బులిస్తూ

ఇద్దరూ లోపలికొచ్చారు

చిన్న గది ఒక ప్రక్కగా మడతమంచం దాని ప్రక్కనే చిన్నపెట్టె ఆ ప్రక్కనే మంచినీళ్ళ కూజా

"కూర్చోండి" అంటూ కళ్యాణికి మంచం చూపి, తను పెట్టెమీద కూర్చున్నాడు

"కళ్యాణి! మీరు టిఫిన్ తినలేదనుకుంటాను ముందు టిఫిన్ తినండి" అన్నాడు శివరావు

"అబ్బే! ఫర్వాలేదు తర్వాత తింటాను" అంది కళ్యాణి

"కాదు ముందు తినండి" అంటూ ఆమె బ్యాగ్‌లోని టిఫిన్ బాక్స్ తీసి ఆమె చేతికిచ్చాడు

కళ్యాణి బాక్స్ ఓపెన్‌చేసి, రెండు చపాతీలు పై మూతలోపెట్టి—

"ఇవి మీరు తీసుకోండి" అంటూ శివరావుకి అందించింది

"అయ్యో! వున్న చపాతీలన్నీ నాకే పెట్టేస్తే ఎలా?"

"అబ్బేలేదు! నాకూ వున్నాయ్ మీరవి తీసుకోండి"

టిఫిన్ తిన్న తర్వాత—

"ఇంతకీ అసలు విషయం చెప్పారు కాదు" అనడిగింది కళ్యాణి

శివరావు తలెత్తి ఆమెకేసి చూసి మళ్ళా తల దించుకున్నాడు

"శివరావుగారూ! మీరలా వుండడానికి కారణం"

ఈసారి కూడా శివరావు మాట్లాడలేదు. అతని జవాబుకోసం ఎదురుచూస్తున్నట్లుగా కళ్యాణి చేతుల్లో ముఖం అన్నుకుని కూర్చుంది పెదవులమీద అందమైన చిరునవ్వు శివరావు ఆమెను చూడలేక చూస్తూ, నెమ్మదిగా—

''కళ్యాణీ ! నాకు ఒక చెల్లెలు వుందని లోగడ మీకు చెప్పాను కానీ, మా చెల్లెలు కుంటిదండి నడవలేదు'' అన్నాడు.

ఆ మాట వినడంతోనే కళ్యాణి హృదయం కలుక్కుమంది !

''కళ్యాణీ ! అతి కష్టంమీద మా చెల్లెలకు ఒక సంబంధం కుదర్చగలిగాను కానీ, వాళ్ళు ఒక షరతు పెట్టారు ''

''ఏవిటది ?''

''నేను గనుక ఆ అబ్బాయి చెల్లెల్నిచేసుకుంటే వాళ్ళు మా చెల్లెలిని చేసుకుంటారట.'' శివరావు చెప్పలేక చెప్పాడు

కళ్యాణి చిత్తరపోయింది !

ఏవిటి తను వింటున్నది ?

భగవంతుడు తనని మళ్ళా అగాధంలోకి తోసేస్తున్నాడు విధి తనని వెక్కిరిస్తోంది రాబోయే ఏడుపుని బలవంతంగా దిగమింగుకుని—

''శివరావుగారూ ! దీనికింత ఆలోచన దేనికి ? ఆ సంబంధం చేసుకోండి'' అంది మెల్లగా

శివరావు చటుక్కున తలెత్తి — ''కళ్యాణీ ! మీరేనా ఈ మాటలు అంటోంది ?'' అన్నాడు

అప్పుడు కళ్యాణి నవ్వింది — ''దీన్లో తప్పేం వుందండి లోకంలో సహజంగా జరిగే విషయమేగా ఇది'' అని అన్నది

శివరావు బాధగా అన్నాడు — ''కళ్యాణీ ! మనం ఒకళ్ళ కొకళ్ళం మనస్సు విప్పి చెప్పుకోలేకపోయినా, మన మనస్సులో వున్నదేవిటో మనకు తెలుసు. మీ చుట్టూ అల్లుకున్న నా జీవితాన్ని తెంచుకుని వేరెవరితోనో ముడివేసుకోలేను ''

కళ్యాణికి దుఃఖంతో నోట మాట రావడం లేదు రెండు చేతుల మధ్య ముఖం దాచుకుంది శివరావు రాయిలా కదలకుండా కూర్చుండిపోయాడు. కళ్యాణిని ఓదార్చే ప్రయత్నం చెయ్యలేదు. ఎలా ఓదార్చాలో శివరావుకి తెలియదు !

ఇప్పుడు, అసలు ఎవరు ఎవరిని ఓదార్చాలి ?

నిశ్శబ్దంగావున్న ఆ గదిలో ఐదునిముషాలు గడిచిన తర్వాత, కళ్యాణి కళ్ళు తుడుచుకుని లేచి — ''వస్తానండి'' అని బ్యాగ్ తీసుకుని బయటకు నడిచింది.

శివరావు లేచి ఏదో అనబోయాడు. కానీ, అప్పటికే కళ్యాణి గుమ్మందాటి బయటకెళ్ళిపోయింది! వెళ్ళిపోతున్న కళ్యాణివేపు సజల నయనాలతో చూస్తూ వుండిపోయాడు శివరావు !

కష్టాలు మనిషిని ఒక్కోసారి మొండివాడినిగా చేస్తాయి ఒక కష్టమైతే దుఃఖించ వచ్చు, భరించవచ్చు ! కానీ, జీవితమంతా కష్టాలమయమయితే ? ఏడవడానికి ఒక్కొక్కసారి కన్నీళ్ళు కూడా మిగలవు ! అదే పిరికివాడయితే ఆత్మహత్య చేసుకుంటాడు మొండివాడయితే కర్మసిద్ధాంతాన్ని ఆశ్రయించి తృప్తిపడతాడు !

## ఇది సంధ్యా సమయం

కళ్యాణి ఇప్పుడదే స్థితిలోవుంది

'అంతా తన పూర్వజన్మ ఖర్మ' అని సరిపెట్టుకుంది ఏది ఎలా జరగాలని రాసిపెట్టివుందో అలాగే జరుగుతుంది ! అని ధైర్యం తనకు తానే చెప్పుకుంది

అంతకంటే ఆమె చెయ్యగలిగిందేంలేదు !

*　　*　　*

''సుజా ?'' మృదువుగా పిల్చాడు కుమార్

కుమార్ ఒళ్ళో పడుకున్న సుజాత లేవకుండానే ''వూ'' అంది

''నీకో విషయం చెప్పనా ?''

''చెప్పు ?''

''మధ్యాహ్నం శారదమ్మగారు మా ఇంటికొచ్చారు ''

''శారదమ్మగారెవరు ?''

''మహిళా మండలి వైస్ ప్రెసిడెంట్‌లే ఆవిడతోపాటు మీ అక్కయ్య కూడా వచ్చింది ''

''ఎందుకో ?'' అంది సుజాత ఆశ్చర్యంగా

''మన పెళ్ళి విషయం మా అమ్మతో మాట్లాడ్డానికి ''

ఈ మాట వినడంతోనే సుజాత దిగ్గునలేచి, కుమార్‌వేపు చూస్తూ —

''నిజమేనా ?'' అంది

''నిజం సుజా. అప్పుడు నేను ప్రక్కగదిలోనే వున్నాను.''

సుజాతకి తల తిరిగినట్టయింది

'కుమార్ విషయం అక్కకెలా తెలిసింది తెలిస్తే మాత్రం, ఆ విషయమేదో తననే అడగొచ్చు గదా !'

''వాళ్ళేం మాట్లాడారు ?''

''ఏమో నేను వినలేదు అయినా సుజా ! నాకీ పెళ్ళి సంసారం అంటే బొత్తిగా ఇష్టంలేదు ఈ వెధవ ఝంఝాటం ఎందుకు ? జీవితమంతా ఇలా హాయిగా తిరుగుతూ గడిపితే ఎంతో బావుంటుంది నీకూ తెలుసుగదా నా స్వభావం ''

కుమార్ ఏదేదో చెప్తున్నాడు

ఐనా సుజాత వినడంలేదు

ఆమె మనసంతా చాలా చికాకుగావుంది అన్నిటికంటే ముఖ్యంగా ఆవిడ్ని పట్టి పీడిస్తున్న బాధ— అక్కయ్యకు కుమార్ విషయం ఎలా తెలిసిందన్న విషయం సుజాత ఇక అక్కడ కూర్చోలేకపోయింది చటుక్కున లేచి నుంచుంది !

''అదేం సుజా ! అప్పుడే లేచావ్ ? పిక్చర్‌కి టైముంది గదా ?''

''లేదు కుమార్ నేనివ్వాళ సినిమాకి రాలేను పనుంది వస్తాను'' అంటూ కుమార్ సమాధానం కోసం కూడా ఎదురు చూడకుండా గబగబా వెళ్ళిపోయింది సుజాత

సుజాత చర్యకు కుమార్ తెల్లబోయాడు 'సుజాతకీ విషయం చెప్పి అనవసరంగా మంచి ప్రోగ్రామ్ పాడుచేసుకున్నానే' అని తనని తాను తిట్టుకున్నాడు

సుజాత బయటకొచ్చి రిక్షా ఎక్కింది కానీ, అప్పుడే ఇంటికెళ్ళాలనిపించలేదు ఐతే, ఎక్కడికెళ్ళాలో వెంటనే స్ఫురించలేదు ఆలోచించగా కళ్యాణి జ్ఞాపకం వచ్చింది. తనీమధ్య సరిగ్గా మాట్లాడ్డంలేదని కళ్యాణి చాలా బాధపడుతోంది కళ్యాణితో మాట్లాడితే బాగుంటుంది అని అనుకుని కళ్యాణి ఇంటి గుర్తులు చెప్పింది

పది నిముషాల్లో కళ్యాణి ఇంటిముందాగింది రిక్షా డబ్బులిచ్చి రిక్షాదిగి, మెట్లెక్కి లోపలికెళ్ళింది హాల్లో ఎవరో క్రొత్తవ్యక్తి కన్పించాడు సుజాత సరాసరి వంటింట్లోకెళ్ళింది

కళ్యాణి కత్తిపీట ముందు కూర్చుని ముక్కలు తరుగుతోంది.

''కళ్యాణి !'' అని పిలిచింది సుజాత

కళ్యాణి తలెత్తి సుజాతని చూసి ముందు ఆశ్చర్యపోయినా సంతోషపడి—

''సుజా ! నువ్వా ! రా రా ! ఏవిటీరోజు నా మీద ఇంత దయ కలిగింది'' అంటూ ఆహ్వానించింది

సుజాత నవ్వుతూ పీట వాల్చుకుని కూర్చోబోయింది

''సుజా ! ఈ మసిలో ఎందుకే హాల్లో కూర్చో ఈ కూర తరిగి వస్తాను'' అంది కళ్యాణి

''ఫర్వాలేదులే'' అని పీటమీద కూర్చుంది సుజాత

''ఏవిటే విశేషాలు ?''

''ఏంలేదు. నిన్ను చూడాలన్పించింది. వచ్చాను.''

ఎందుకో ఆ సమాధానం కళ్యాణికి తృప్తి కలిగించలేదు

''నీ విశేషాలు ఏవిటో చెప్పు కళ్యాణి ?''

''ఏం వున్నాయ్. వండడం, తినడం, వుద్యోగం, నిద్ర. ఇవేనా విశేషాలు.''

ఇంతలో ఇద్దరు పిల్లలు పరిగెట్టుకువచ్చారు వాళ్ళల్లో చిన్నపిల్ల —

''చూడు పిన్నీ ! అన్నయ్య కొడ్తున్నాడు'' అంటూ ఫిర్యాదు.

''ఎవరే వీళ్ళు ?'' సుజాత ప్రశ్నించింది

''మా అక్క పిల్లలు ''

''ఇక్కడి కెప్పుడొచ్చారు ?''

### ఎక్స్‌పో - 85

అంతర్జాతీయ వైజ్ఞానిక, సాంకేతిక ప్రదర్శన ఎక్స్‌పో–85 ను టోక్యోనగరం సమీపంలో నిర్వహించ మున్నారు గతంలో ఇటువంటి ప్రదర్శనలు ఎక్స్‌పో–70, ఎక్స్‌పో–75 లను ఒసాకా, ఒకనావా నగరాల్లో నిర్వహించారు. ఎక్స్‌పో–85 ప్రదర్శనకు సన్నాహాలను ప్రారంభించారు రోడ్లు మొదలైన వాటి నిర్మాణం ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తికాగలవు పెవిలియన్ల నిర్మాణం వచ్చే సంవత్సరం ప్రారంభమవుతుంది 13 విదేశాలు, అయిదు అంతర్జాతీయ సంస్థలు ఇంతవరకు తమ సమ్మతిని తెలిపినట్లు అధికారులు తెలియ చేశారు




## ఇది సంధ్యా సమయం

"మా బావ తీసుకొచ్చాడు హాల్లో కూర్చున్నాడే అతనే మా బావ"

"వాడేనా? పెళ్ళాన్ని చంపిన రాక్షసుడు. ఏ ముఖం పెట్టుకుని ఇక్కడికొచ్చాడు అసలు మీరెలా రానిచ్చారు?" అనడిగింది సుజాత కోపంగా

కళ్యాణి నవ్వి –

"ఎంతైనా బంధుత్వం ఎక్కడికి పోతుందే"

"ఇంకా ఏం బంధుత్వం? మీ అక్క చావుతోనే అది చెరిగిపోయింది"

"లేదులేవే మళ్ళా క్రొత్తగా బంధుత్వం ఏర్పడబోతోంది" అంది

సుజాత తెల్లబోయి –

"అంటే ?" అంది

"నేను మా బావని పెళ్ళి చేసుకోబోతున్నాను"

"కళ్యాణి!" సుజాత అరచినంత పనిచేసింది

"సుజాతా! అంతగా అరవబోకే ఏదో 'ఖూనీ' జరుగుతోందని చుట్టుప్రక్కలవాళ్ళు పరిగెట్టుకు రాగలరు" అంటూ నవ్వింది

కళ్యాణి మాటకు మండిపోయిన సుజాత చటుక్కున లేచి --

"నేను వెడుతున్నాను" అంది

కళ్యాణి లేచి సుజాత చేయి పుచ్చుకుని – "సుజా! నువ్వెడితే నామీద ఒట్టే నువ్వుకూడా కోపగించుకుంటే ఇంక నా బాధని పంచుకునేదెవరే?" అంది

కళ్యాణి మాటలకు సుజాత ఆశ్చర్యంగా ఆమె ముఖంలోకి చూసింది ఏమనుకుందో ఏమో వచ్చి పీటమీద కూర్చుంది క్షణం ఆగి నెమ్మదిగా సుజాత ఇలా అన్నది –

"కళ్యాణీ! నువ్వు చేస్తున్న పనేం బాగాలేదే"

"ఎందుకని బాగాలేదే మా బావకేం తక్కువ? అతనికి పిల్లనిస్తామంటూ ఆడపిల్లల తండ్రులు క్యూలో నిలబడుతున్నారు అంతేకాదు పిల్లతోపాటు కొద్దోగొప్పో కట్నం కూడా ఇస్తారట"

కళ్యాణి మాటలకు సుజాత తెల్లబోయి –

"నువ్వు చెప్పేది నిజమేనా కళ్యాణీ?" అంది

"నూటికి నూరుపాళ్ళు నిజం మమ్మల్ని రికమండ్ చెయ్యమని మా ఇంటికే వచ్చారు కొందరు"


"బహూశా వాళ్ళకి మీ బావ విషయం తెలియదేమో"

"ఎందుకు తెలియదు బాగా తెలుసు"

"ఐతే, తెలిసే ఇస్తున్నారా కూతుళ్ళను"

సుజాత కిదంతా చాలా వింతగా వుంది అతని సంగతి తెలిసే పిల్లనిస్తామంటున్నారు అంటే వాళ్ళు రాక్షసులైనా కావాలి. మూర్ఖులైనాకావాలి!

"సుజా! నువ్వొట్టి అమాయకురాలివే నీకింకా లోకం సంగతి తెలియదు పెళ్ళికాకుండా ఆడపిల్ల ఇంట్లో వుంటే తల్లిదండ్రులు చూస్తూ వూరుకోలేరు! ఒకవేళ వాళ్ళు వూరుకున్నా చుట్టుప్రక్కల వాళ్ళు వాళ్ళని నిద్ర పోనివ్వరు కాకుల్లా పొడుస్తారు. సరైన సంబంధం తేవడానికి డబ్బుండదు ఏదో విధంగా పెళ్ళి చెయ్యాలి అందుకని మగాడనేవాడెవడైనా దొరికితే చాలు




భీమవరం శ్రీనివాస్ భారతి ఆధ్వర్యంలో ఇటీవలి 'సుందర మందారము' కావ్యావిష్కరణ చేస్తున్న శ్రీ మధునా పంతుల సత్యన్నారాయణ శాస్త్రి కావ్యకర్త శ్రీ జంధ్యాల వెంకటేశ్వరశాస్త్రి, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి శ్రీ ఎస్ టి వి రాజగోపాలాచార్యులు గార్లని కూడా చిత్రంలో చూడవచ్చు

కట్టబెట్టేద్దామని చూస్తుంటారు వాడు హంతకుడు కానీ, వ్యభిచారికానీ, అంతకు ముందే రెండూ మూడు పెళ్ళిళ్ళు చేసుకున్నాసరే మగవాడైతే చాలు, పెళ్ళి జరిపించేస్తారు ఇక, ఆపిల్ల, ఆ తర్వాత చచ్చినా బ్రతికినా సరే పట్టించుకోరు ఇలా వుందే నేటి సమాజ పరిస్థితి సన్నడిగితే మధ్యతరగతి, కుటుంబాల్లో ఆడపిల్లల్ని పుట్టగానే చంపెయ్యాలి వాళ్ళని సరిగ్గా పెంచలేక, వాళ్ళ కోరికలు తీర్చలేక ఆడపిల్లల్ని మానసికంగా, శారీరకంగా హింసించే కంటే ఇలా చంపడం నయం కదూ?" కళ్యాణి మాట్లాడుతుండగానే అప్రయత్నంగా ఆమె కళ్ళలో నీళ్ళు నిలిచాయి!

సుజాతకి ఏం మాట్లాడాలో తెలియక వూరు కుండిపోయింది ఇద్దరిమధ్యా కొన్ని సెకన్లు నిశ్శబ్దం తర్వాత సుజాత అన్నది–

"కళ్యాణీ! నువ్వు తెలిసి, తెలిసి ఆ వూబిలో దిగడం నా కిష్టంలేదు"

"ఏం చెయ్యమంటావ్ సుజా! జీవితాంతం పెళ్ళి చేసుకోకుండా వుండిపొమ్మంటావా? పేరులోనే 'కళ్యాణి' వుంది కదా, నుదుట కళ్యాణ తిలకం ఎందుకంటావా?" అంటూ నవ్వింది కళ్యాణి

"అదికాదు శివరావు" అంటూ సుజాత ఏదో చెప్పబోయింది వెంటనే కళ్యాణి అందుకుని–

"ఓ! అదా! నీకింకా ఈ విషయం తెలియదు కదూ" అంటూ శివరావు విషయం చెప్పింది

అంతా విని సుజాత నిట్టూర్చింది

"కట్నం ఇచ్చి పెళ్ళిచేసుకునే స్తోమత నాకు లేదు అందుకే బావని పెళ్ళి చేసుకోదలిచాను అదీగాక, అక్క పిల్లలు మరీ చిన్నవాళ్ళు. ఎవరి చేతుల్లోనో పడి ఆ పిల్లలు కష్టపడుతుంటే చూడలేక మేము బాధపడాలి బావని చేసుకుంటే పిల్లల్ని నేనే పెంచొచ్చు ఇలాగైనా అక్క 'ఆత్మ' శాంతిస్తుంది అందుకే, ఇవన్నీ ఆలోచించి నాన్నకు యిష్టం లేకపోయినా ఒప్పించాను సుజా! వచ్చే

నెలలోనే మా పెళ్ళి నువ్వు తప్పకుండా రావాలి'' అంది కళ్యాణి

సుజాత ఏం మాట్లాడలేకపోయింది ఆమెకి అర్థంకానిది ఒక్కటే —

'తమ జీవితాలు ఎందుకిలా వున్నాయి మనిషికి జీవితంలో కష్టాలూ, సుఖాలూ సమపాళ్ళల్లో వుంటాయంటారు ! కానీ, తమ బ్రతుకుల్లో ఇంత వరకూ కష్టం తప్ప, సుఖం రేఖా మాత్రంగానైన తొంగి చూడలేదు ! ఎందుచేత ? కళ్యాణిపైకి నవ్వుతున్నా మానసికంగా ఎంతో చిత్రహింస అనుభవిస్తోంది నవ్వుతూ మాట్లాడగలగడం ఇదేలా సాధ్యపడుతోంది ?'

సుజాత ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ —

''సుజా ! నువ్వేలావున్నావ్ ?'' అనడిగింది కళ్యాణి

''అంటే ?''

''అదే నీ ఆరోగ్యం ?''

''బాగానే వున్నాను ''

కళ్యాణి ఇంకేం ప్రశ్నించలేదు కూరలో పోపు వేయడానికి లేచింది సుజాతకూడా లేచి —

''వస్తాను కళ్యాణి'' అంది

''అప్పుడేనా ? కాస్సేపు కూర్చో సుజా '' అంది కళ్యాణి

సుజాతకి కూర్చోబుద్ధికాలేదు తన బాధని కళ్యాణితో చెప్పుకుని వుపశమనం పొందుదామనివస్తే, కళ్యాణి పిడుగులాటి వార్త అందించింది ఇప్పుడు ఈ బాధల్ని విని తట్టుకునే శక్తి తనలో లేదు ఈ కష్టాలూ, కన్నీళ్ళూ లేని ఏ సుదూర ప్రాంతాలకో వెళ్ళిపోవాలి !

అవును వెళ్ళిపోవాలి

ఎక్కడికి ?

ఎక్కడికో ?

ఎక్కడికో వెళ్ళిపోవాలి !

* * *

''జయా ! అక్కడే నిలబడిపోయావే రామ్మా లోపలికి '' గుమ్మంలోనే నిలబడివున్న జయని చూసి శారదమ్మగారు అన్నారు

జయ లోపలికొచ్చి కుర్చీలో కూర్చున్న తర్వాత, శారదమ్మగారు జయవేపు చూశారు

'జయ చాలా చిక్కిపోయినట్లు కన్పించింది వున్నన్నాళ్ళు హాయిగా మనుషుల్ని వుండనివ్వడు కదా దేవుడు' అని అనుకుందావిడ

''జయా ! ఆవిడ మాటలకు బాధ పడుతున్నావా ?''

జయ తలెత్తి శారదమ్మగారివేపు చూసింది

మనసులో కుమార్ తల్లి అన్న మాటలు మెదిలాయి —

''చూశారా శారదమ్మగారూ ! కాలం ఎలా మారిపోయిందో — ఎంత వయసొచ్చినా ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు కాకపోవడం, వాళ్ళు కోర్కెల్ని అదుపులో పెట్టుకోలేక, ఏ మగాడు కన్పిస్తాడా ? ఎవడ్ని వల్లో వేసుకుందామా ? అని ఎదురుచూడ్డం, కాస్త ఎర్రగా, బుర్రగా ఎవడయినా కన్పిస్తేచాలు, వాడిని ఏదో విధంగా మచ్చిక చేసుకోవడం ఇప్పుడి ఆడపిల్లలకు ఇదో అలవాటైపోయింది మా అబ్బాయిని కూడా ఇలాగే 'వల్లో' వేసుకుని వుంటుంది ఆ సుజాత ఏవిటో ? పాడురోజులొచ్చి పడ్డాయి. దీనికంతటికీ కారణం ... ''

ఆపైన మాటలను తను వినలేకపోయింది అవసరం తనది అందుకే అన్నీ దిగమింగుకుని కూర్చుంది

ఆ ఇంటినుంచి వచ్చేసిన తర్వాత శారదమ్మగారు మండిపోయారు

''చూశావా జయా ? నేను ముందే చెప్పాను గదా! ఆవిడ అందరూ అనుకున్నంత మంచిదికాదని. మాటల్లోనే ఆవిడ అభ్యుదయమంతా చేతలదగ్గరికి వచ్చేసరికి అందరూ ఒక్కటే ఎంత రాక్షసంగా మాట్లాడిందో తలచుకుంటే నాకే ఎంతో బాధ అన్పిస్తోంది ఆవిడగారి పిచ్చి తమ్ముడిని నువ్వు, నువ్వు చేసుకోవాలట అలా చేసుకుంటే కుమార్‌కీ, సుజాతకీ పెళ్ళి చేస్తుందట అది వినగానే ఆవిడ్ని ఈ చెంపా, ఆ చెంపా వాయగొట్టాలన్పించింది అతి కష్టంమీద కోపం దిగమింగాను అయినా అంత తేలికగా ఆవిడ్ని వదలకూడదు ''

జయ ఆవిడవేపు భయంగా చూస్తూ — ''అంత పనిమాత్రం చెయ్యకండి. బాగుండదు'' అంది

''ఎవరికీ బాగుండనిది. ఆవిడకా ? మనకా ? నీకేం తెలియదు. నువ్వూరుకో జయా.''

''అదికాదండీ. ఆవిడ చెప్పిన దానికి నేను ఒప్పుకుంటున్నాను ''

శారదమ్మగారు జయవేపు వెర్రిగా చూసి—

''ఏవిటే ? నువ్వు.'' అని ఇంకా ఏదో అనబోతుండగా, జయ అందుకుని—

''అవునండి నేను నిజంగానే ఆమె చెప్పిన పెళ్ళికి ఒప్పుకుంటున్నాను'' అంది దృఢంగా

''జయా ! ఇదినువ్వు ఆలోచించి తీసుకున్న నిర్ణయమేనా ?'' శారదమ్మగారు నమ్మలేక ఆశ్చర్యంగా అడిగారు

''ఆలోచించానండి ఒక్కరోజు కాదు నాలుగు రోజులు రాత్రీ, పగలూ ఆలోచించాను నేనీ పెళ్ళికి ఒప్పుకుంటున్నాను మీరు వెళ్ళి మిగతా విషయాలు కుమార్ తల్లిగారితో మాట్లాడిరండి'' అంది

జయ ఎందుకీ నిర్ణయం తీసుకుందో శారదమ్మగారు వూహించగలిగారు

చెల్లెలు సుజాత జీవితం నాశనం కాకూడదు ఒకరి ఆనందం కోసం మరొకరు బ్రతుకులో చీకటిని తోడుతెచ్చుకోవడం' జయమీద జాలి కలిగింది

''జయా ! సుజాతకోసం నువ్వు నీ జీవితాన్ని నాశనం చేసుకోవడం నాకేమాత్రం ఇష్టంలేదు సుజాత ఏవన్నా చిన్నపిల్లా ? తన బాగోగులు తాను చూసుకోగలదు కుమార్‌ని ఎలాగో ఒప్పించి తనే పెళ్ళి చేసుకుంటుంది నువ్వు మాత్రం ఎవరి జీవితమో బాగుకోసం, నీ బ్రతుకుని నరకం చేసుకోవద్దు నా మాట విను జయా'' అంది శారదమ్మగారు


''సుజాత విషయం మీకు తెలియదండి అది చాలా మొండి నా చెల్లెలు ఎలాటిదయినా, నామీద ఎంత కోపంవున్నా అది నాశనమవుతుంటే నేను చూస్తూ వూరుకోలేను'— అని జయ చెప్పాలనుకుంది


మాటలు పెగలడంలేదు గుండె వేగంగా కొట్టుకుంటోంది కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి


''జయా ! మాట్లాడవే ఏవిటాలోచిస్తున్నావ్ ?''


అవును ! తను మాట్లాడలేదు

తన కంఠం మూగబోయింది ఐనా, మాట్లాడాలి కుటుంబం కోసం, కుటుంబ ప్రతిష్ట






కోసం మాట్లాడాలి గొంతులో వున్న నరాల శక్తి నంతా ఒకచోట చేర్చి —

''ఏంలేదండి మీరు వెళ్ళి ఆవిడతో మాట్లాడండి నేను మళ్ళీ రెండు రోజుల్లో వచ్చి మిమ్మల్ని కలుస్తాను'' అని చెప్పి జయ బయటకొచ్చేసింది

శారదమ్మగారు, జయ వెళ్ళినవేపే ఆశ్చర్యంగా చూస్తూండిపోయారు!

*    *    *

ఎప్పుడు, ఎక్కడ ఎవరికి ఏవిధంగా జరుగుతుందో ఎవరికీ తెలియదు!

కొందరు జీవితాన్ని ప్రేమిస్తారు మరికొందరు డబ్బుని ప్రేమిస్తారు మరికొందరు మనుష్యుల ప్రేమకై తపిస్తారు ఇంకో జాతివారు జీవితాన్నీ, డబ్బునీ రెంటినీ కలిపి ప్రేమిస్తారు!

ఎవరు ఏవిధంగా దేన్ని ప్రేమించినా, అందరికీ అన్నీ లభ్యంకావు! ప్రతి మనిషికీ ఏదో ఒక కొరత వుండనేవుంటుంది అలా కాకపోతే ఈ సృష్టి మరోరకంగా వుండేదేమో!

ఇక్కడ సుజాత కూడా ఒక అపోహలోపడి తన జీవితాన్ని చేతులారా నాశనం చేసుకుంది!

*    *    *

ఆ రోజు కళ్యాణి బ్యాంక్‌లో కూర్చుని పని చేసుకుంటూ వుండగా పోస్టుమేన్ కవరొకటిచ్చి వెళ్ళిపోయాడు ఆ కవరు ఎవరు రాశారో కూడా కళ్యాణి చూసుకోలేదు బ్యాంక్‌లో పనంతా పూర్తి చేసుకుని, ఇంటికెళ్ళబోతూ కళ్యాణి లెటర్ చించి చదివింది

కళ్యాణీ,

నా గురించి నీకు తెలిసే వుంటుంది. నేను వెళ్ళిపోతున్నాను ఎక్కడికెడతానో నాకే తెలియదు! ఒక ప్రశాంతమైన ప్రదేశానికి మాత్రం వెడతాను నువ్వు నా స్నేహితురాలివైనందుకు గర్వపడుతున్నాను

కళ్యాణి! నువ్వు జీవితంతో పోరాడుతూనే నా మంచి చెడ్డల గురించి ఎంతో శ్రద్ధ వహించేదానివి ఇప్పుడు నేనుగా నీకేం చెప్పలేను నా గురించి నీకు అంతా తెలుసు నేనిలా చేసినందుకు నన్ను క్షమించు కళ్యాణి అంతేగానీ శపించొద్దు నేనెక్కడున్నా నీ ఆప్యాయతను మరచిపోలేను మన స్నేహం ఇలాగే, ఇలాగే శాశ్వతంగా వుండాలి శెలవ్

నీ సుజాత.



## ఇది సంధ్యా సమయం

ఆ ఉత్తరం చదవడంతోనే కళ్యాణి నిలువునా వణికిపోయింది. ఒక్కసారిగా సుజాత బ్రతుకులో జరిగిన సంఘటనలు గుర్తుకు రాగా చలించిపోయింది

సుజాత ఏదో సాధిద్దామని ప్రయత్నించి అన్ని విధాలా ఘోరంగా ఓడిపోయింది. ఏం సాధించాలనుకున్నదో, లక్ష్యం ఏమిటో తెలియకుండానే వెళ్ళిపోయింది!

'ఇప్పుడు తనేం చెయ్యాలి? ఈ సంగతి సుజాత ఇంటి దగ్గర తెలుసునో లేదో? వాళ్ళను ఏ విధంగా తను ఓదార్చాలి. బలహీనురాలైన ఆ తల్లి ఎంత క్షోభ పడుతుంది జయ ఏం చేస్తుంది? ఇప్పుడు వారికి జీవనాధారం ఏమిటి?'

ఈ ఆలోచనలు రావడంతోనే ఆదుర్దాగా కళ్యాణి గబగబా సుజాత ఇంటికేసి బయలుదేరింది

*    *    *

''పోస్ట్'' అన్న కేక వినిపించడంతో లోపల పనిచేసుకుంటున్న జయ వచ్చి ఓ కవరు అందుకుంది

ఆ కవరు ఎవరు రాశారో తెలియక అటూ ఇటూ తిప్పి చించి చదవడం మొదలుపెట్టింది —

అక్కా,

నువ్వు నాకోసం ఎంతో పెద్ద త్యాగం చెయ్యబోతున్నావని తెలిసింది ఈ సంగతి కుమార్ చెప్పాడు ఇటువంటి పనికిమాలిన త్యాగాలంటే నా కసహ్యం అందుకే, వెళ్ళిపోతున్నాను ఒకచోట నుంచి మరోచోటికి 'గాలి' ఎలా వెళ్ళిపోతుందో, నేనూ అలాగే వెళ్ళిపోతున్నాను దూరంగా, చాలా దూరంగా వెళ్ళిపోతున్నాను!

నేను వెళ్ళిపోతున్న ఈ తరుణంలో నీకో విషయం రాస్తున్నాను ఇది తప్పో ఒప్పో నాకు తెలియదు కానీ, నా వూహకు మాత్రం ఇది నిజం!

ఒకప్పుడు నేను శ్రీనివాస్‌ను ప్రేమించాను ఆరాధించాను అతని కలల్లో బ్రతికాను నా ఆరాధన ఎంతో కాలం నిలవలేదు నా స్థానంలో అతన్ని ప్రేమిస్తూ నువ్వు ప్రవేశించావ్ అమ్మకు జబ్బుగా వుండగా, అతను మనింటికి వస్తున్నప్పుడు, మీరిద్దరూ చాలా సన్నిహితంగా వుండడం నేను అనేకసార్లు గమనించాను ఆ సమయంలో, నాకు చెందవలసిన అమూల్య సంపదను అక్రమంగా నువ్వు పొందుతున్నట్టుగా వ్యధ చెందేదాన్ని ఆ వ్యధలో నుంచి నీమీద అకారణమైన కోపం వస్తూవుండేది!

నన్ను నేను వున్నతంగా వూహించుకుంటూ, ఇదీ అని చెప్పలేని కసితో కుమార్‌తో తిరిగాను జీవితంలో ఎన్ని రకాలుగా అనుభవించాలో, ఎన్ని రకాలుగా భ్రష్టత చెందాలో అన్నిరకాలుగా చెందాను

ఇప్పుడు నేను అందుకు విచారించడం లేదు తెలిసిచేసిన తప్పుకు విచారించవలసిన పనిలేదని నా వుద్దేశం కానీ, నాలా ఏ ఆడపిల్ల బ్రతుకూ కాకూడదనే నా కోరిక

నా కోరిక ప్రకారం నువ్వు శ్రీనివాస్‌ను పెళ్ళి చేసుకో మీ ఇద్దరూ ఆనందంగా వుండండి

నా గురించి మాత్రం విచారించకండి నేనెక్కడున్నా నా బిడ్డతో సుఖంగానే వుంటాను పిరికిదానిలా చావను

'పుట్టిన ప్రతిప్రాణీ ఎప్పుడోఒకప్పుడు చావాలి గదా' అని, కోరి ముందుగా ప్రాణత్యాగం మాత్రం చెయ్యను అమ్మను జాగ్రత్తగా చూస్తూ వుండు

శెలవ్

సుజాత

ఉత్తరం చదవడంతోనే జయకి నోట మాట రాలేదు కాళ్ళూ చేతులూ వణికాయి శరీరమంతా చెమటపట్టింది గుండె అమిత వేగంగా కొట్టుకోసాగింది కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి ఏం చెయ్యాలో తెలియక, అచేతనంగా గోడకు ఆనుకుని కళ్ళు మూసుకుంది

సరిగ్గా ఆ సమయంలోనే డాక్టర్ శ్రీనివాస్ లోపలకొచ్చాడు జయను ఆ స్థితిలో చూసి గబగబా ఆమె దగ్గరకెళ్ళి చేతిలోవున్న ఉత్తరాన్ని తీసి చదవసాగాడు

శ్రీనివాస్ ఆ ఉత్తరం చదువుతూవుండగా కళ్యాణి లోపలకొచ్చింది

కొన్ని నిముషాలు గడిచిన తర్వాత శ్రీనివాస్ తలెత్తి చూశాడు ఎదురుగా కళ్యాణి కనిపించింది

''చూశారా? సుజాత ఎంతపని చేసిందో?'' అన్నాడు

''ఇంతకుముందేనాకూఉత్తరంవచ్చింది సుజాత ఇలా చేస్తుందని, తన జీవితాన్ని కావాలని ఇలా నాశనం చేసుకుంటుందని వూహించలేకపోయానండి'' కళ్యాణి మాట్లాడుతుంటే కంఠం రుద్ధమయింది

''సుజాతకు నామీద ఇలాంటి అభిప్రాయం

# ఉత్తర జర్మనీలో 2000 ఏళ్ళనాటి శవాలు!



విండెబీలో దొరికిన అమ్మాయి (14) ముఖాన్ని పునర్‌నిర్మించగా ఏర్పడ్డ ఆకారం: దొరికినప్పుడు ఎలావున్నదో పైన వున్న బొమ్మల్లో చూడవచ్చు

**భూ**మిలో కుళ్లిపోయి బొగ్గు వంటి పదార్థంగా మారిపోయిన వృక్ష విశేషాలని 'పీట్' అంటారు. దీనికోసం ఉత్తర జర్మనీ, డెన్‌మార్కు ప్రాంతాలలో తవ్వేవారికి కొన్ని శవాలు దొరుకుతూ ఉంటాయి. కొంతకాలంగా పురావస్తు శాస్త్రజ్ఞులు, చరిత్రకారులు ఈ శవాలని అనుశీలనకి గురి చేస్తున్నారు. ఎన్నో రకాల ఊహాకల్పనలు జరిగాయి. జరుగుతున్నాయి.

ఇటీవలే "జర్మన్ ట్రిబ్యూన్" వారపత్రికలో "లూబెక్కర్ నాక్ రిష్టెన్" అనే దినపత్రిక నుంచి సేకరించిన కొన్ని వివరాలు పడ్డాయి. విండెబీ అనే (జర్మనీ) చోట 1952 లో దొరికిన శవాలని శాస్త్రజ్ఞులు పరిశీలించారు. వాటిలో ఒక 14 సంవత్సరాల అమ్మాయి శవం ఎక్కువ పరీక్షలకి గురి అయింది. ఈ అమ్మాయి సుమారు 1900 సంవత్సరాల ముందు జీవించి ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనాలు వేశారు.

ఆ అమ్మాయి ఎముకలని పరిశీలించగా ఆమె ప్రతి ఏడాదీ కొంతకాలం [వసంతకాలంలో అంటున్నారు.] తీవ్రంగా ఉపవాసం చేసేదని తెలిసిందిట. ఎందుకోగాని ఆమె కళ్లకి గంతలు కట్టి ఉన్నాయి. ఆమెని కట్టేసి పాతిపెట్టారు. ఆమెని బలి ఇచ్చి ఉండవచ్చు లేదా వ్యభిచారిణి అని చంపి ఉండవచ్చు లేదా తగినంత ఆహారం లేక ఆమె జబ్బుచేసి చనిపోయి ఉండవచ్చు—అని శాస్త్రవేత్తల అభిప్రాయాలు.

కొన్ని శవాల పక్కన తాడు దొరికింది. "ఇది ఉరి తీయబడిన వారి శవాలా?" అని పురావస్తు శాస్త్రజ్ఞులు అడుగుతున్నారు.

యువతీ, యువకుల శవాలతోపాటు చిన్నపిల్లల కళేబరాలు కూడా లభిస్తూ ఉంటాయి. వీటిని గడ్డి, వస్త్రాలతో కప్పి పాతిపెట్టేవారని తెలుస్తోంది.



ట్రుండ్హోమ్

గుండెస్ట్రప్



కొన్ని శవాల కడుపులలోని ఆహారాన్ని తీసి పరీక్షించారు. పళ్లు, గింజలు, ఆకు కూరలు కలిపి వండి తినేవారని తెలిసింది. అటువంటి వంటనే ఇప్పుడు చేసి తినటానికి ప్రయత్నించిన వారికి ఇంచుమించు వాంతి తీసినంత పని అయిందిట! కడుపులో భోజనంలోని పదార్థాలని పట్టి—వివిధ వృక్ష విశేషాలు దొరికే ఋతువులు తెలుసు కనుక—మరణించిన ఋతువుని తెలుసుకొన గలుగుతున్నారు. చలికాలంలో మరణాలు అధికంగా ఉండేవిట.

[మొహెంజదారో – హరప్పాలలో దొరికిన 'పశుపతి' బొమ్మ వంటిది డెన్ మార్కులో కూడా దొరకటం ఒక విశేషం. ఇటీవలే ఇంగ్లాడ్ లోని స్టోన్ హెంజి కట్టిన కాలం చాలా ప్రాచీన మయినదని తెలిసినది. మధ్య యూరోపులో అతి ప్రాచీన కాలంలోనే 'రాత' ఉండేదని కూడా తెలిసింది. యూరోపులో 'నాగరికత'గా పిలువబడేది అర్వాచీనం అన్న అభిప్రాయాన్ని ఈ విశేషాలు బలపరచటం లేదు!] ★

వుందని ఎప్పుడూ అనుకోలేదు అసలు నేనెప్పుడూ సుజాతను మరో దృష్టితో చూడలేదు. జయకూ నాకూ ఏదో వుందని వూహించుకుని అపోహచెంది, సుజాత జీవితాన్ని చేతులారా నాశనం చేసుకుంది నా వృత్తిపరంగా, డాక్టర్‌గా నేను అందరితో చనువుగా వుంటాను జయతో కూడా అలాగే వుండేవాడిని పైగా ఆ కుటుంబానికీ మా కుటుంబానికీ వున్న సాన్నిహిత్యం గొప్పది సుజాత ఇలా చేసినందుకు నాకు చాలా బాధగా వుంది ఈ విషయం తెలిస్తే మా నాన్నగారు ఎంతో కృంగిపోతారు."

"అవును! మీరన్నది నిజమే డాక్టర్‌గారు అపోహలతో, అపనమ్మకాలతో దగాపడిన ఆడపిల్లలు ఈ లోకంలో చాలామంది వున్నారు. కానీ, ఎప్పుడో ఒకప్పుడు నిజం తెలియడం, ఆ వ్యక్తులు పశ్చాత్తాపం

## ఇది సంధ్యా సమయం

చెందడం జరుగుతూ వుంటుంది ఎప్పటికైనా సుజాత తన తప్పును గుర్తించగలిగితే చాలు సుజాత ఇప్పుడెక్కడుందో మనకు తెలియదు ఆమెకీ నిజం తెలిసేదెలా?"

కళ్యాణి మాటలకు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడలేదు అతను దేన్ని గురించో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు

కళ్యాణి, జయకేసి చూసింది ఆమె స్పృహ లేనట్టుగా గోడకు ఆనుకుని అలాగేవుంది లోపల గదిలో సుజాత తల్లి కళ్లు మూసుకు మంచంలో పడుకుని వుంది ఆ తల్లికి ఇవేమీ తెలియవు తెలిస్తే ఏం జరుగుతుందో మనకు తెలియదు పిల్లలు స్కూలు నుంచి వచ్చి అప్పుడే లోపల కొస్తున్నారు

కళ్యాణి నెమ్మదిగా జయను ఓదార్చడానికి ప్రయత్నిస్తోంది

ఎవరి నోటివెంట నుంచీ ఒక్కమాట కూడా రావడంలేదు

ఆ ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది! ఘనీభవించిన ఆ నిశ్శబ్దం నుంచి ఏ రాగం వినిపిస్తుందో!!

సంధ్యా సమయం

ఆ సమయంలో పూర్తిగా వెలుగూ చీకటీ కాని వాతావరణం నెలకొనివుంది.

వెలుగు అంతరించి చీకటి వస్తుంది

చీకటి అంతరించి వెలుగు వస్తుంది

అందరి జీవితాలకూ సంధ్యా సమయం రాక తప్పదు!

(అయిపోయింది) ●